

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 02-07-2025 | సంపుటి - 24 | సంచిక - 59 | రూ : 4 | పేజీలు: 8

## దేశరాజధానిలో లాల్‌దర్వాజ బోనాలు

- సందడి చేసిన విదేశీయులు

దిల్లీ: లాల్‌దర్వాజ బోనాలు దేశరాజధాని దిల్లీలో రెండో రోజు ఘనంగా జరిగాయి. మంగళవారం ఇండియాగేట్ నుంచి తెలంగాణభవన్ వరకు మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు ధూంధాంగా జరిగింది. తొలుత సింహవాహిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెసిడెంట్ కమిషనర్ శశాంక్‌గోయల్ ఇండియాగేట్ వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి 150 మంది సాంస్కృతిక కళాకారుల సంప్రదాయ డప్పు మోతలు, పోతురాజుల ఆటలు, ఒగ్గుడోలు

తరువాయి 2లో






2లో

## తెలంగాణ రైతుకు.. కేసీఆర్ మరణశాసనం

- మన నీటిని ఏపీకి తాకట్టు పెట్టారు
- 2015లో కృష్ణా నీటిని రాసిచ్చారు
- 811 టీఎంసీలకు 299 టీఎంసీలు చాలన్నారు
- 2016లో గోదావరిలో 3000 టీఎంసీల వరద నీరుందన్నారు
- చంద్రబాబు గోదావరి నీటి వినియోగంపై సర్వే చేపట్టినా వ్యతిరేకించలేదు
- జగన్‌ను ఇంటికి పిలిచి గోదావరి నీటితో రాయలసీమ సస్యశ్యామలం అన్నారు
- బనకచర్లపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

2లో

## పట్టాభిరామ్ కన్నుమూత...

- గుండెపోటుతో ఆసుపత్రిలో తుదిశ్వాస
- ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రచయితగా ప్రఖ్యాతి
- మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి.. కౌన్సెలింగ్‌తో ఎన్నో కుటుంబాలకు బాసట

**జులై 01, హైదరాబాద్, రవీంద్రభారతి, పంజాగుట్ట, గాంధీనగర్(కాకినాడ):** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీవీ పట్టాభిరామ్(75)

తరువాయి 2లో




## అమెరికా.. బాటలోనే బ్రిటన్

- వీసా నిబంధనలు కఠినతరం
- భారతీయులపై ప్రభావం




**జులై 01, లండన్ :** విదేశీ వలసదారుల విషయంలో అమెరికా బాటలోనే బ్రిటన్ (యూకే) పయనిస్తోంది. వివిధ ఉద్యోగాల్లో చేరే విదేశీ నిపుణులకు సంబంధించిన వీసా నిబంధనలను కఠినతరం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు కఠినతర వీసా నిబంధనల బిల్లును మంగళవారం పార్లమెంటులోని దిగువ సభ హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నూతన నిబంధనలు.. దేశ వలస విధానాన్ని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించే కొలమానాలని హోం మంత్రి యెవెట్ కూపర్ అభివర్ణించారు. వలస విధానాన్ని తమ ప్రభుత్వం క్రమబద్ధీకరించి, నియంత్రణలోకి తీసుకొస్తుందని తెలిపారు.

తరువాయి 2లో



## తెలంగాణలో అధికారమే లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడతాం
- భాజపా కొత్త అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు
- బాధ్యతల స్వీకరణ
- హాజరైన కేంద్ర మంత్రులు, రాష్ట్ర నేతలు

**జులై 01, హైదరాబాద్:** వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపాకు అధికారమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని భాజపా రాష్ట్ర నూతన సారథి ఎన్.రామచందర్‌రావు అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేశానన్నారు.

తరువాయి 2లో

## మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం



- సిగాచీ పరిశ్రమ బాధితులకు సీఎం భరోసా
- మంత్రులతో కలిసి సంఘటన స్థలం పరిశీలన

**జులై 01, సంగారెడ్డి:** హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ధాటికి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం,

తరువాయి 2లో



## లక్ష మంది మార్గదర్శులు...

## 15 లక్షల బంగారు కుటుంబాలు

- పేదలకు సాయం అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- 2029 నాటికి పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- త్వరలో నిరుద్యోగ భృతి
- రౌడీలతో రాజకీయాలు చేయాల్సి వస్తోంది
- తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి 'ప్రజావేదిక'లో సీఎం చంద్రబాబు

2లో



## ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండా

- రాష్ట్రంలో భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా
- పార్టీ వైభవం, ప్రభుత్వ గొప్పతనం ప్రజల్లోకి తీసుకెళదాం
- భాజపా ఏపీ శాఖ నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



2లో

## తెలంగాణలో అధికారమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు న్యాయవాదులు, విద్యార్థుల కోసం పోరాడానని, ఇకనుంచి తెలంగాణ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రిటర్నింగ్ అధికారిణిగా వ్యవహరించిన కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజే... ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ జెండాను రామచందర్‌రావుకు అందించి.. సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు ప్రసంగించారు. ''14 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన భాజపాలో తెలంగాణ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వంగా భావిస్తున్నా. అయినా సాధారణ కార్యకర్తగానే పనిచేస్తా. భాజపాలో కొత్త, పాత అనే తేడా ఉండదు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్తా కృషి చేయాలి. భారాస వాట్సప్ యూనివర్సిటీ, కాంగ్రెస్ ఫేక్ న్యూస్ యూనివర్సిటీలు నాపై ట్రోలింగ్ చేస్తున్నాయి. నేను సౌమ్యుడిని కాదు. 14 సార్లు జైలుకు వెళ్లాను. క్రిమినల్ లాయర్‌ను. ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతాం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తాం. పార్టీ ఈ స్థాయికి వచ్చిందంటే కార్యకర్తల త్యాగాలు, నాయకుల కృషి కారణం'' అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

**కాంగ్రెస్, భారాసలు రాష్ట్రాన్ని దోచుకున్నాయి: కిషన్‌రెడ్డి**

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుని అప్పులపాలు చేశాయని... భాజపా అధికారంలోకి వస్తేనే అమరవీరుల ఆకాంక్షలు నెరవేరుతాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రామచందర్‌రావు సారథ్యంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు, నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా.. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. కేసీఆర్, రాహుల్ గాంధీ కుటుంబాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంటి నేతలు రాష్ట్రాన్ని దోచుకున్నారని... అన్ని రకాలుగా వెనక్కి నెట్టారని ఆరోపించారు. తెలంగాణకు గత పదకొండేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను కేంద్రం అందించిందని చెప్పారు. 40 రైల్వే స్టేషన్లతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీనిపై రాష్ట్రంలో ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధమేనని భారాస, కాంగ్రెస్‌లకు కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.

## పట్టాభిరామ్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గుండెపోటుతో కన్నుమూశారు. కొన్నేళ్లుగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సోమవారం సాయంత్రం డయాలసిస్ కోసం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఒమేగా ఆసుపత్రికి వెళ్లారు. ఆ తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అరగంటపాటు వైద్యులు శ్రమించినా ఫలితం లేకపోయింది. సోమవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారని వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య జయశేషు, కుమారుడు వెంకటసాయి ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ సతీమణి కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలు. అభిమానుల సందర్శనార్థం పట్టాభిరామ్ భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి ఆనంద్‌నగర్ కాలనీలోని స్వగృహానికి బుధవారం ఉదయం 9 గంటలకు తరలిస్తారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**ప్రదర్శనలతో జాగృతం చేశారు..**

పట్టాభిరామ్ 1950లో కాకినాడ జిల్లా కాజులూరు మండలం శీల గ్రామంలో జన్మించారు. 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతుల 15 మంది సంతానంలో పట్టాభిరామ్ ఒకరు. కౌమార దశలో ప్రమాదంతో కాలి వైకల్యం కలిగి ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ఆత్మన్యూనతాభావానికి లోనైనా.. తండ్రి ఇచ్చిన ధైర్యంతో దాన్ని జయించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఏ చదువుతున్న రోజుల్లో ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబార్ రావు వద్ద మెలకువలు నేర్చుకున్నారు. డిగ్రీ అనంతరం కాకినాడలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఉద్యోగ విధులు నిర్వహించారు. కాకినాడలో అనేక స్టేజీలపై ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవారు. అనంతరం బదిలీపై హైదరాబాద్ వచ్చారు. ఇక్కడా తన ప్రదర్శనలను కొనసాగించి పేరు తెచ్చుకున్నారు. 1984లో.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్న సమయంలో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్‌కు.. అక్కడి నుంచి మళ్లీ రవీంద్రభారతికి స్కూటర్ నడిపారు. తన ఇంద్రజాల ప్రదర్శనలతో మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేశారు. హిప్నాటిజాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు.

## అమెరికా బాటలోనే బ్రిటన్

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వం భారీగా వలసలను ప్రోత్సహించిందని, దీనివల్ల కేవలం నాలుగేళ్లలోనే వలసలు నాలుగు రెట్లు పెరిగాయని వెల్లడించారు. విదేశీ వలసలను వీలైనంతగా తగ్గించి, వివిధ నైపుణ్యాల పెంపు కోసం బ్రిటన్ పౌరులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం.. ఉద్యోగుల నైపుణ్యాలకు విలువ ఇస్తుందని, అయితే వారు శ్రమ దోపిడీకి గురి కాకుండా నివారిస్తుందని కూపర్ స్పష్టం చేశారు. బ్రిటన్‌కు వచ్చే విదేశీయులంతా సరైన రీతిలో, సరైన దిశగా సేవలను అందించగలిగేలా పర్యవేక్షిస్తామని వెల్లడించారు. ఈ విషయంలో రాజీపడేది లేదని తేల్చి చెప్పారు.

**జులై 22 నుంచి అమల్లోకి?**

ఈ ఏడాది మే నెలలో బ్రిటన్ సర్కారు విడుదల చేసిన ఇమ్మిగ్రేషన్ శ్వేతపత్రంలోనే ఈ కొత్త వీసా నిబంధనలను ప్రతిపాదించారు. తాజాగా వాటిని హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రవేశపెట్టడం ద్వారా చట్టపరమైన ఆమోదం దిశగా కసరత్తును మొదలుపెట్టారు. పార్లమెంటు ఆమోదం పొందాక.. జులై 22 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఈ నిబంధనల ప్రభావం ఎంతో మందిపై భారతీయులపై పడనుంది. ఎందుకంటే ఏటా చాలా మంది భారతీయులు బ్రిటన్‌లో ఉన్న పర్సనల్ కేర్ సెంటర్లు, హోటళ్లు, భవన నిర్మాణ సంస్థలు, ఆసుపత్రుల్లో దిగువ స్థాయి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తుంటారు.

## దేశరాజధానిలో లాల్‌దర్వాజ బోనాలు

నాట్యాలు, పూర్ణకుంభాల మధ్య అమ్మవారి ఘటాల ఊరేగింపు తెలంగాణభవన్ వరకు సాగింది. ఈ కార్యక్రమం దేశరాజధానిలో వివిధ రాష్ట్రాల ప్రజలతోపాటు, విదేశీపర్యాటకులను విశేషంగా ఆకట్టుకొంది. పలువురు విదేశీయులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా చూస్తూ భారతీయ సాంస్కృతిక రూపాలను, బోనాల పండగ వైభవాన్ని ఫొటోలు, వీడియోల్లో బంధించారు. ఊరేగింపు అనంతరం తెలంగాణ భవన్‌లో ఘటాల స్థాపన జరిగింది.



# మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం

(మొదటిపేజీ తరువాయి)

కర్మాగారం యాజమాన్యం సమన్వయంతో రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఈ మేరకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పేలుడుకు కారణాలపై సమీక్షించారు. కర్మాగారంలో పీరియాడికల్ తనిఖీలు చేస్తున్నారా అని ఫ్యాక్టరీస్ భద్రతా విభాగం అధికారులను ఆరాతీశారు. ఎవరి వైఫల్యంతో ఇంత పెద్ద ప్రమాదం జరిగిందో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి డ్రయ్యర్లను ఎందుకు తనిఖీ చేయలేదని నిలదీశారు. తర్వాత కంపెనీ ఎదుట ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఎం మాట్లాడుతూ... ''ఇది అత్యంత విషాదకరమైన దుర్ఘటన. కర్మాగారంలో ప్రమాదం జరిగే సమయంలో 143 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 58 మంది సురక్షితంగా ఉన్నారు. మరికొందరి ఆచూకీ కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు అందిస్తాం. తక్షణ సాయంగా మృతిచెందిన కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించాం. గాయపడిన కార్మికులకు నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాం. మృతదేహాలను వారి సొంతూళ్లకు తరలించేలా చూస్తాం. రెండు రోజుల నుంచి ఇద్దరు మంత్రులు, కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర యంత్రాంగం కర్మాగారంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేస్తున్నారు.

*** ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక విధానం**

సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి కారణాలను కనుగొనేందుకు సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ వేశాం. ఈ పరిశ్రమలో కాలానుగుణ (పీరియాడికల్) తనిఖీలు ఎలా జరిగాయో పరిశీలించాలని, తనిఖీలు జరిగితే లోపం ఎక్కడుందనేది తేల్చాలని సూచించా. వారిచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రసాయన, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించాం'' అని వివరించారు. సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

*** సిగాచీ పరిశ్రమ ప్రతినిధులెక్కడ?**

''సిగాచీ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులెక్కడ? సమీక్ష సమావేశానికి వారెందుకు హాజరు కాలేదు. ఇంత పెద్ద ప్రమాదం చోటుచేసుకుంటే... వారు వచ్చి బాధితులకు అండగా నిలవాలి కదా? ఇక్కడికి రాలేనంత బిజీగా ఉంటే పరిశ్రమను నిర్వహించడం ఎందుకు? మూసేయండి. మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని తక్షణమే వారిని పిలిపించాలి. సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలి. మృతుల కుటుంబాలకు మానవతా దృక్పథంతో పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. క్షతగాత్రులకు సంస్థపరంగా లభించే సౌకర్యాలు కల్పించాలి'' అంటూ కంపెనీ ప్రతినిధితోపాటు అధికారులను సీఎం ఆదేశించారు.

# తెలంగాణ రైతుకు.. కేసీఆర్ మరణశాసనం

హైదరాబాద్: కృష్ణా, గోదావరి జలాలను కేసీఆర్, హరీశ్‌రావులు ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టుపెట్టి.. తెలంగాణ రైతులకు మరణ శాసనం రాశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 811 టీఎంసీలలో తెలంగాణకు 555 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎంసీలు చాలని 2015లో వారిద్దరూ రాసిచ్చారన్నారు. గోదావరిలో 3,000 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి వెళ్తోందని, ఈ నీటిని రాయలసీమకు మళ్లించుకోవచ్చని 2016లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పారని, ఈ విషయాన్ని మినిట్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. 2019లో గోదావరి నీటిని మళ్లించి రాయలసీమను రతనాల సీమగా చేయాలని కేసీఆర్ సూచించారని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం చోద్యం చూస్తోందని, తెలంగాణ హక్కులను కాలరాయడానికి 8 మంది ఎంపీలను భాజపాకు ఇవ్వలేదని విమర్శించారు. భారాసను బతికించడానికి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణ హక్కులను రక్షించుకోవడానికి కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తేవాలని, పోరాడాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు, శ్రేణులకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అబద్ధాలతో నీటి సెంటిమెంట్‌ను రగల్చడానికి ప్రయత్నిస్తున్నారని, అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై మంగళవారం ప్రజాభవన్‌లో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లకు అవగాహన కల్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

**వారి ధనదాహాన్ని తీర్చుకోవడానికే కాళేశ్వరం**

''కేసీఆర్ ధనదాహాన్ని తీర్చుకోవడానికి ప్రాణహిత చేవెళ్ల పేరు, ఊరు మార్చడంతో పాటు అంచనా పెంచి కాళేశ్వరం చేపట్టారు. రూ.1.50 లక్షల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.లక్షా రెండువేల కోట్ల విలువైన పనిచేసి రూ.96,000 కోట్లు చెల్లించారు. ఇంత ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారు. కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి గతంలో తాకట్టు పెట్టిన కేసీఆర్, హరీశ్‌రావు.. ఆ రాచపుండునే ఇప్పుడు సమస్యగా సృష్టించాలని చూస్తున్నారు. భారాస పునరుజ్జీవానికి నీటి సెంటిమెంట్‌ను వాడుకోవడానికి చూస్తున్నారు. ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటుచేసి ఒకరోజు కృష్ణాపై, మరోరోజు గోదావరిపై చర్చిద్దాం రమ్మంటే భారాస ముందుకు రాలేదు. ఆపార్టీ నేతలది వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడ. నదీ జలాలను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లి దోషులుగా నిలబెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ మనుగడ చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు ప్రభుత్వ మనుగడ గోదావరి ప్రాజెక్టులపై ఉంది. ఈ లెక్కలన్నీ ఒక్క రోజులోనో, ఒక ఏడాదిలోనో తేలేవి కావు. ఇవన్నీ ప్రజలకు వివరించాలి.

**భాజపా సహాయ నిరాకరణ**

గత 11 ఏళ్లుగా నీటి సమస్యలపై భాజపా ఏ నిర్లక్ష్యం చూపిందో ఇప్పుడూ అదే కొనసాగిస్తోంది. భారాసను బతికించడానికి భాజపా పరోక్షంగా సాయం చేస్తోంది. కాంగ్రెస్ నేతలంతా ఆపార్టీపైనే దృష్టి పెట్టాలి. కిషన్‌రెడ్డి మాట్లాడే ప్రతిమాట కేటీఆర్ కార్యాలయం నుంచి వచ్చిందేనని నేను చెబుతున్నా. మేం వెళ్లి కిషన్‌రెడ్డిని కలసి తెలంగాణ సమస్యలను వివరిస్తే.. ఏ రోజూ మమ్మల్ని ఏ కేంద్ర మంత్రి వద్దకూ తీసుకెళ్లలేదు. నీటి సమస్యల పరిష్కారానికి ఇరురాష్ట్రాల మధ్య పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు చూస్తోంది. ఏపీ నేతలు వారి రాష్ట్రానికి చెందిన సమస్యల గురించి కేంద్రంలో ప్రతి ఒక్కరినీ కలుస్తుంటే కిషన్‌రెడ్డి ఒక్క పనీ చేయకుండా సమస్యలు కొనసాగాలని చూస్తున్నారు. ఏపీ ప్రభుత్వం ముందుకొచ్చి తెలంగాణకు సహకరించాలి.

**నాటి సీఎం ఇచ్చిన వివరాలతోనే..**

2016లో జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి నుంచి సముద్రంలోకి 3000 టీఎంసీలు పోతున్నాయని కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశం తర్వాత గోదావరిపెన్నా అనుసంధానానికి డీపీఆర్ బాధ్యతను వాప్కోస్ సంస్థకు అప్పగిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకొన్నారు. గోదావరిపెన్నా మొదటి దశపై 2018లో మరో జీఓ ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ ఇచ్చిన వివరాలతోనే గోదావరి జలాలను పెన్నాకు తరలించడానికి మొదటిదశ కింద వాప్కోస్‌తో ఏపీ ప్రభుత్వం సర్వే చేయిస్తే వారు 4 రకాల ఆప్షన్లు ఇచ్చారు. దీనిప్రకారం 400 టీఎంసీలను తరలించడానికి అవకాశం ఉందన్నారు. బనకచర్లలో 200 టీఎంసీలు ఎత్తిపోయడానికి ఇప్పుడు పంపులు పెడుతున్నా.. 300 టీఎంసీలు తీసుకెళ్లేలా విస్తరించడానికి ప్రణాళిక రూపొందించారు. మళ్లీ జగన్ సీఎం కాగానే నాటి ప్రగతిభవన్‌కు పిలిచి పెన్నానది వరకూ గోదావరి జలాలు తరలించవచ్చని కేసీఆర్ చెప్పారు. గోదావరిపై 968 టీఎంసీలను వాడుకోవడానికి మేం ప్రాజెక్టులు కట్టుకున్న తర్వాతే వరద, మిగులు జలాల లెక్కలు తేలతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల నుంచి 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలి. ఈ నీటిని, మైనర్ ఇరిగేషన్‌లో ఆదా అయిన నీటిని కలిపి పాలమూరురంగారెడ్డికి అనుమతి తెచ్చుకోవడానికి ఏపీ సహకరించాలి.

# లక్ష మంది మార్గదర్శులు... 15 లక్షల బంగారు కుటుంబాలు

రాజమహేంద్రవరం, కాకినాడ, తాళ్లపూడి: 'సామాన్య కుటుంబంలో పుట్టి అవకాశాలను అందిపుచ్చుకుని పైకి ఎదిగినవారు ఉన్నారు. వారిలో నేనూ ఒకడిని. రోజూ ఆరేడు కి.మీ. పాఠశాలకు నడిచి వెళ్లి చదువుకున్నాను. మనతో పాటు పుట్టిన వాళ్లలో కొందరు ఇంకా వెనుకబడి ఉన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి పేదరికం నుంచి బయటకు తేవాలన్న లక్ష్యంతో పీ4 కార్యక్రమానికి రూపకల్పన చేశాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం 'ప్రజావేదిక' సభలో ఆయన ప్రసంగించారు. 'ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించి లక్ష మంది మార్గదర్శుల చేత సాయం అందించే లక్ష్యం పెట్టుకున్నాం. 2029 కల్లా పేదరికం లేని సమాజ నిర్మాణం దిశగా ముందుకెళ్తున్నాం' అని సీఎం చెప్పారు. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని.. నిరుద్యోగ భృతికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందన్నారు. 'అన్నదాతా సుఖీభవ' ద్వారా కేంద్రం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన రోజే తామూ వేస్తామన్నారు. తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు ఖాతాల్లో వేశామని.. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలు జరుగుతున్నాయని వారికీ లబ్ధిని చేకూరుస్తామని వివరించారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.9.54 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని.. 8.50 లక్షల మందికి లభిస్తాయని సీఎం చెప్పారు. ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయన్నారు. గత పదేళ్లలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయో ఒక్క ఏడాదిలోనే అంతకంటే ఎక్కువ తెచ్చామన్నారు.

# ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని, పార్టీ కార్యకర్తలు గర్వపడేలా బలోపేతం చేస్తానని భాజపా ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భాజపా ఆంధ్రప్రదేశ్ సంఘటన్ పర్వ్ రాష్ట్ర అధ్యక్ష, జాతీయ మండలి సభ్యుల ఎన్నికల వేడుక విజయవాడలో మంగళవారం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడిగా మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల పరిశీలకుడు పీసీ మోహన్ ప్రకటించారు. జాతీయ మండలి సభ్యులుగా ఎన్నికైన వారి వివరాలు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి పాకా వెంకట సత్యనారాయణ ధ్రువీకరణ పత్రాన్ని మాధవ్‌కు అందించారు. అనంతరం దగ్గుబాటి పురందేశ్వరి నుంచి మాధవ్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి హోదాలో మాధవ్ మాట్లాడారు. ''ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండాను రాష్ట్రంలో పారదర్శకంగా తీసుకెళ్లాలి. గత ప్రభుత్వ ఐదేళ్ల నిరంకుశ పరిపాలనకు ప్రజలు చరమ గీతం పాడి.. 11 సీట్లకే పరిమితం చేశారు. కూటమిపై ప్రజలు ఉంచిన విశ్వాసం నిలబెట్టుకునేలా కలిసికట్టుగా కృషిచేయాలి. అధ్యక్ష పదవి అంటే గొప్ప స్థానం కాదు. అదొక బాధ్యత. పార్టీ కోసం ఎంతోమంది పనిచేస్తున్నా నా మీద నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళదాం. నరేంద్ర మోదీ రాష్ట్రానికి చేస్తున్న సాయం ప్రజలకు వివరిద్దాం. మన అందరికీ రాష్ట్రమంటే అభిమానంతోపాటు జాతీయ స్ఫూర్తి ఉండాలి. మన ప్రాంతంలోని సౌకర్యాలు, సంపద, సంస్కృతికి పునరుజ్జీవం పోయాలి. గుజరాత్‌ను మించి సంపద సృష్టించగలిగే ప్రాంతం ఆంధ్ర.. అమరావతిని స్థిర రాజధానిగా చేసుకోవాలి. రాష్ట్ర నిర్మాణంలో అందరం భాగస్వాములు కావాలి. తెలుగు భాషకు మించిన భాష ప్రపంచంలో లేదు. ప్రభుత్వాలు మన భాషను ప్రోత్సహించడంలో వెనకబడుతున్నాయి. గత ప్రభుత్వం తెలుగును విస్మరించింది. తెలుగు భాష ఉన్నతి కోసం భాజపా శ్రమిస్తుంది'' అని మాధవ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మాధవ్‌కు పార్టీ కోసం రాష్ట్రమంతా తిరిగే అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి మాధురిని పలువురు నేతలు తమ ప్రసంగాల్లో కోరారు. దీంతో నవ్వులు విరిశాయి. మాధవ్ సతీమణి, పిల్లలను వేదికపైకి రమ్మని నేతలు కోరగా ఆమె సున్నితంగా తిరస్కరించారు. వేదిక కింద నుంచే పిల్లలతో కలిసి కార్యకర్తలకు అభివాదం చేశారు.

* భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు

*** ప్రతిఘటించిన వారికీ ధన్యవాదాలు: పురందేశ్వరి**

భాజపా తనకు సముచిత గౌరవం ఇచ్చిందని, రాష్ట్ర అధ్యక్ష పదవితోపాటు రాజమహేంద్రవరం ఎంపీ హోదా కల్పించిందని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ''పెద్దలు నేర్పిన విలువలు.. వారు చూపిన నాయకత్వంతో పట్టుదలతో రెండేళ్లు పార్టీ కోసం పనిచేశా. నన్ను ప్రోత్సహించిన వారికి, ప్రతిఘటించిన వారికీ ధన్యవాదాలు'' అని వ్యాఖ్యానించారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నూతన అధ్యక్షుడు పనిచేయాలని సూచించారు.

*** మనమే సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలి: శ్రీనివాసవర్మ**

రాష్ట్రంలో మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని, మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు.

# రాబోయే కాలంలో విద్యార్థిని విద్యార్థులు డాక్టర్లుగా ఎదగాలి

* **టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు**

కుత్బుల్లాపూర్, ప్రజా స్ఫూర్తి :రాబోయే కాలంలో విద్యార్థిని విద్యార్థులు డాక్టర్లుగా ఎదగాలని అందుకు తగిన విద్యా విధానం కృషి పట్టుదల వంటి అంశాలను క్రోఢీకరించి తెలియజేసే విధంగా ఉండాలని ప్రముఖ వైద్య ప్రముఖులు డాక్టర్ నితిన్ చంద్ర, డాక్టర్ కె. మెహర్ బాబు లు అన్నారు.మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఆర్ నాయక్ నగర్ లో గల సత్యవాణి విద్యా నికేతన్, అపురూప కాలనీ లో గల టీవీఆర్




మోడల్ హై స్కూల్ నందు నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ వైద్య ప్రముఖులను పిలిచి సన్మానించారు. సత్యవాణి విద్యానికేతన్ నకు డాక్టర్ నితిన్ చంద్ర టీవీఆర్ మోడల్ హై స్కూల్ నకు డా.మెహర్ బాబు లు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రస్తుత కాలంలో వైద్య రంగానికి ఉన్న విలువలు, వైద్య రంగంలో రాణించాలంటే విద్యార్థులకు కావలసిన మెలుకువలు వివరించారు .మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ అమ్మ నాన్నలు జన్మనిస్తే వైద్యంతో ప్రాణం పోసే డాక్టర్లను సన్మానించుకోవడం మానవ ధర్మం అని అన్నారు. పాఠశాల యాజమాన్యం డాక్టర్స్ ని అతిథులుగా పిలిచి వారిని సన్మానించి వారిని విద్యార్థులకు ఉదహరిస్తూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు డైరెక్టర్ ఎన్. లక్ష్మీ పూర్ణిమ కూడా ఒక డాక్టర్ అవడం గర్వంగా ఉంది అని తెలియజేశారు, అనంతరం టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన టీ.కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి లు వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయరాజ్, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కను నాటిన సూపరిండెంట్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ లో సూపరింటెండెంట్ డాక్టర్ రాధా మోహన్, వైద్యులకు ఘనంగా సన్మానించి అనంతరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో మొక్కను నాటిన ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు,మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్ , ప్రకృతి హరిత దీక్షపరురాలు నైనిక రజువా, ఆస్పత్రి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

## డాక్టర్స్ డే సందర్భంగా మొక్కతో శుభాకాంక్షలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కొత్తగూడెం లోని ఉదయ నేచర్ క్యూర్ సెంటర్ నిర్వాహకులు, నేచురోపతి ప్రాక్టీషనర్, హీలర్. జి. సుగుణారావు కు, ప్రకృతి హరిత దీక్షపరురాలు చిన్నారి నైనిక రజువా మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారితో పాటు శుభాకాంక్షలు అందజేసినవారిలో మొక్కలప్రేమికుడు, హరిత దీక్ష వ్యవస్థాపకులు, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, తెలుగు వెలుగు ఛానెల్ అధినేత పూర్ణ చందర్ రావు, ప్రకృతి ఆశ్రమం సభ్యులు దయానంద సాగర్, శోభారాణి లు పాల్గొన్నారు.కాగా.. ఇటీవల చిన్నవయసులోనే ప్రకృతి పరిరక్షణలో భాగంగా శుభ కార్యక్రమాలకు, ప్రత్యేకత కలిగిన రోజులను పురస్కరించుకొని మొక్కలతో శుభాకాంక్షలు, అభినందనలుతెలియ చేస్తున్న చిన్నారి నైనిక రజువాను, ఆమెకు తోడ్పాటు అందిస్తున్న తల్లిదండ్రులు దశరథ్ రజువా, ఝాన్సీరాణి లను, సుగుణా రావు, పూర్ణచంద్రరావు, మొక్కల రాజశేఖర్ లు అభినందించారు

## సంక్షేమ సంఘాల సమిష్టి కృషితోనే కాలనీ అభివృద్ధి

* **బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సంక్షేమ సంఘాల సమిష్టి కృషితోనే కాలనీ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో ఇటీవల ఏర్పాటైన పాండు బస్తీ సంక్షేమ సంఘం సభ్యులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి నేతృత్వంలో, బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఒక్కొక్కడి కృషికి మించినది సమిష్టి కృషి అని, సంక్షేమ సంఘాల ఐక్యత, సహకారంతోనే కాలనీల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సంఘం సభ్యులు పరస్పర సమన్వయంతో పని చేస్తే అనేక అభివృద్ధి పనులను సులభంగా నెరవేర్చుకోవచ్చని తెలిపారు.అనంతరం, నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నూతన సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉప్పర మీన్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీపతి సతీష్ కుమార్, కమ్మిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శులు తమ్మిశెట్టి వరలక్ష్మి, మనుపడి సుకన్య, శ్రీశైలం యాదవ్, మహేష్, పాలేకర్ సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు బేతల రవీందర్, ఎం.డి. షాకీర్, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు..

## బాల కార్మిక వ్యవస్థ సమూల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాద్యతగా వ్యవహరించాలి




* **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం :బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ 11వ విడుత కార్యక్రమం జూలై 1 నుండి 31వ తారీఖు వరకు జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో అమలు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం ఆపరేషన్ ముస్కాన్XI అధికారులు , సిబ్బందితో కలిసి ఎస్పీ కార్యాలయంలో పోస్టర్ ను ఆవిష్కరించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతీ సబ్ డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ ,. నలుగురు సిబ్బందిని ఒక బృందంగా నియమిచడం జరిగిందని తెలిపారు.పోలీసు శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాలు ఈ నెల రోజులపాటు ఆపరేషన్ ముస్కాన్XIలో భాగంగా బాలకార్మికులను గుర్తించడానికి దాడులు నిర్వహిస్తారని తెలియజేసారు.గత జనవరిలో జరిగిన ఆపరేషన్ స్మైల్ లో 40 మంది పిల్లలను గుర్తించి రాష్ట్రంలోనే జిల్లా ఐదో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎక్కడైనా బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ ఆపరేషన్ ముస్కాన్ XI నకు జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్XI బృందాలలో నియమింపబడిన పోలీస్ అధికారులు,సిబ్బంది , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్,ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్,హెల్త్ డిపార్ట్మెంట్ , వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో స్థానిక పిఆర్ ఫంక్షన్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లాలో పలు హాట్ స్పాట్స్ ను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా నిఘా ఉంచాలని ఈ సందర్భంగా డిఎస్పీ రెహమాన్ ముస్కాన్ అధికారులకు సూచించారు.గతంలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా రెస్క్యూ చేసిన పిల్లల యొక్క ప్రస్తుతం పరిస్థితి గురించి తెలుసుకోవాలని అన్నారు.బడికి వెళ్లకుండా చదువు మానేసి పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని మరలా స్కూల్లో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. .కిరాణషాపులలో,మెకానిక్ షాపులలో,హోటళ్లలో,ఇటుక బట్టీలలో,పౌల్ట్రీ ఫామ్ లలో,రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు , ఇతర ప్రదేశాలలో తప్పిపోయిన,వదిలివేయబడిన పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం,లేదా వారిని సంరక్షణా గృహాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా బిక్షాటన , వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు దృష్టికి వస్తే వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారి స్వర్ణలత లెనీనా,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిపీఓ హరి కుమారి,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు,చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సందీప్ , ఎస్సైలు రమాదేవి,విజయ కుమారి, ఏసోబు,సూర్యం , ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## చేపల బోన్‌లెస్ కటింగ్ ద్వారా పోషకాహారం

, **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: చేపలను బోన్‌లెస్‌గా తయారు చేయడం ద్వారా వాటి మార్కెట్ విలువ పెరిగే అవకాశం ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఫిష్ వ్యాపారులు, మత్స్యకారులతో కలిసి "చేపలను బోన్‌లెస్‌గా (ముల్లు లేకుండా) తయారు చేసే విధానం" పై ప్రత్యక్ష ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ విధానం నేర్చుకోవడం ద్వారా మత్స్యకారులు, ఆదివాసీ సముదాయాలు, చేపలపై ఆధారపడి జీవించేకుటుంబాలు, ఎస్ హెచ్ జి మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. బోన్‌లెస్ చేప ముక్కలను పిల్లలు, పెద్దలు సులభంగా తినగలిగే విధంగా ఉండటంతో మంచి పోషకాహారం అందించే అవకాశం ఉందని వివరించారు.బోన్‌లెస్ చేప ముక్కల ద్వారా చికెన్ టిక్కా లాంటి రక రకాల వంటకాలు, ఐటమ్స్ తయారు చేసి, చేపలకు కొత్త విలువ చేర్చవచ్చని తెలిపారు. తద్వారా చేపలను తినే ప్రజలకు కొత్త రుచులు అందించడం, ఆదాయాన్ని పెంచుకోవడం సాధ్యమవుతుందన్నారు. అలాగే, చేపల తలలు, మిగిలిన భాగాలతో పోషక విలువ



గల రుచికరమైన సూప్ తయారు చేసి జిల్లావాసులకు అందించడం ద్వారా ఆరోగ్యం, ఆదాయం రెండూ సంపాదించుకోవచ్చునని, అలాగే మిగిలిన వ్యర్థాలను ఎరువుగా వాడటం ద్వారా పర్యావరణం పరిరక్షణతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.ఈ ప్రయత్నం ద్వారా మత్స్యకారులు, ఫిష్ వ్యాపారులు, ఎస్ హెచ్ జి మహిళలు తమ సామర్థ్యాన్ని పెంచుకొని, ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతో పాటు ఆదాయ మార్గాలను కూడా విస్తరించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ విధానాన్ని ప్రోత్సహించి మరిన్ని కుటుంబాలు లబ్ధిపొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

## అభివృద్ధి చేసే అధికారులకు సహకరించాలి

* **పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అభివృద్ధి పనులు చేపట్టే అధికారులకు బస్తీవాసులు సహకరించాలని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు. శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆదేశాలతో బస్తీలోని పార్క్ సమీపంలో గల రోడ్డు నిర్మాణం



కోసం అధికారులు తమ సిబ్బంది చేత మట్టి కుప్పలను ఇతర వ్యర్థాలను తొలగిస్తూ రోడ్డు వేసేందుకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న పనులను మంగళవారం బస్తి వాసులతో కలిసి అధ్యక్షుడు చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నిధులను కేటాయిస్తూ పనులను పూర్తి చేయిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులకు చంద్రారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు . తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, నేతలు రఘు, చారి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు మన ప్రాణాలను కాపాడే ప్రత్యక్ష దైవ స్వరూపాలు

* **హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి :వైద్యులు మన ప్రాణాలను కాపాడే ప్రత్యక్ష దైవ స్వరూపాలు అని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జగద్గిరిగుట్టలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు జన్మ తల్లి ఇస్తే, పునర్జన్మ వైద్యులు ఇస్తారు అన్నారు. వైద్యో నారాయణ హరి. అన్నారు. డాక్టర్ సత్యనారాయణ(రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ ), బస్తీ దవఖాన డాక్టర్ శృతి విద్య, ఫిజియోథెరపిస్ట్ జాహ్నవి గంగవరపు, డాక్టర్ శోభన్ బాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల సమితి, జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే, మదర్ థెరేస ఫౌండేషన్ శ్రవణ్ కుమార్,హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ కోశాధికారి మైసా దేవి, సభ్యులు సాజిత్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు..

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్ సునీత



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని మూసాపేట్ సర్కిల్ లో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సునీతను మంగళవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి తన ఆస్తి మ్యుటేషన్ నిమిత్తం మూసాపేట సర్కిల్ ఆస్తి పన్ను విభాగంలోని సీనియర్ అసిస్టెంట్ సునీతను సంప్రదించాడు. ఆమె ఆస్తి మ్యుటేషన్ పత్రాలు ఇచ్చేందుకు బాధితుడి నుండి 80 వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా, అతను ఆమెను బ్రతిమిలాడటంతో 30 వేల రూపాయలకు తగ్గేది లేదంటి తెగేసి చెప్పింది. ఆమె వేధింపులు తట్టుకోలేక బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. దీంతో మంగళవారం మధ్యాహ్నం సునీతకు బాధితుడు డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెండ్ గా పట్టుకున్నారు. ఆమె నుండి 30 వేల రూపాయలు, బాధితుడి ఫైల్ స్వాధీనం చేసుకొని ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ సోదాలు ఏసీబీ డిఎస్పి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగాయి.

## ప్రభుత్వ అలసత్వంతోనే పాశమైలారం ఘటన ఎమ్మెల్సీ కవిత

**: ఎమ్మెల్సీ కవిత**



పటాన్‌చెరు: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వ అలసత్వం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. పరిశ్రమల్లో సేఫ్టీపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బాధితులకు గ్రీన్ ఛానల్ ద్వారా సాయం అందించాలన్నారు.

# తల్లి దండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారు

* **రాందేవ్ రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్**
* **రాందేవ్ రావ్ ఆసుపత్రి లో ఘనంగా జాతీయ డాక్టర్స్ డే వేడుకలు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తల్లి దండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారని రాందేవ్ రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం కూకట్ పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రి లో బీ హెడ్ ద మాస్క్ హు హెల్స్ ద హెలర్స్ అనే నినాదం తో వైదలందర్నీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు తమ ప్రాణం పోతుందని తెలిసి కూడా తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా రోగుల కొరకు తమ ప్రాణాలను ఫనంగా పెట్టి వైద్యం చేస్తారన్నారు. అందుకే వైద్యుణ్ణి వైద్యో నారాయనో హరి అంటారన్నారు. వైద్యం ఒక వృత్తి గా కాకుండా ప్రాణాలను కాపాడే ఒక మహోన్నత శక్తి గా వైధ్యాన్ని అభివర్ణింస్తుంటారన్నారు. . అందరికి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే, కుటుంబం , కుటుంబం తో పాటు సమాజం, సమాజం తో పాటు ఊరు, ఊరు తో పాటు దేశం కూడా ఆరోగ్యం గా ఉంటుందని తెలిపారు. సమాజానికి మరింత చేరువయ్యే సేవలను రాందేవ్రావు ఆసుపత్రి ప్రారంభించినట్లు తెలిపారు. 115 మంది డాక్టర్లు రాందేవ్ రావు ఆసుపత్రి నందు పనిచేయుచున్న వైద్యులందరికి వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాందేవ్ రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ ని, ప్రముఖ స్త్రీ నిపుణురాలు చాయదేవి ని , ఇతర వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్కృతి నుండి ప్రెసిడెంట్ లయన్ సుష్మ, సుజాత సూర్యారాజు , ఆదరణ ఫౌండేషన్ తరుపున ఆరిగెల రఘునాథ్ బాబు, జగన్ ఎర్రవెల్లి, పెరి ప్రసాద్, తెల్ల హరికృష్ణ, నరేంద్ర లు పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మల్కాజ్గిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : వైద్యో నారాయణ హరి" అంటే వైద్యులు దేవునితో సమానం అని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం డాక్టర్స్ డే లైన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరై కేక్ కట్ చేసి డాక్టర్లన్నీ అందరిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్స్ డే లైన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేయడం ఎంతో అభినంద విషయమని మల్కాజ్గిరి ప్రభుత్వంలో ఏర్పాటు చేసి డాక్టర్లన్నీ అందరిని సన్మానించుకోవడం వారి సేవలను గుర్తు వినియోగించుకోవడం శుభ పరిణామామని ఈ సందర్భంగా డాక్టర్లు అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ రాజు, డాక్టర్ సునీత డాక్టర్ సంగీత్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సభ్యులు లయన్ గంప నాగేశ్వరరావు లయన్ దొంతి శ్రీనివాస్, లయన్ లింగారెడ్డి,లయన్ మనోహర్ రెడ్డి,లయన్ రవీందర్ నాథ్ గుప్తా,లయన్ కమలాకర్, లయన్ సాంబశివరావు , మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి జేఏసీ వెంకన్న జీకే హనుమంతరావు అమినుద్దీన్, చిన్న యాదవ్, రాము యాదవ్, హేమంత్ పటేల్, ఉపేందర్, సురేష్ మల్లేష్ యాదవ్ నవీన్ యాదవ్ సర్వీస్ యాదవ్ శ్రీనివాస్ వెంకటేష్, వాసు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో భాజపాని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా : మాధవ్

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో భాజపాని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని ఆ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు మోహన్ ప్రకటించారు. అనంతరం ప్రస్తుత అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి నుంచి మాధవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కార్యకర్త గర్వపడేలా భాజపాను బలోపేతం చేస్తానని ప్రకటించారు. పదవి అంటే గొప్పస్థానం కాదు.. అదొక బాధ్యత అని అన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల కు ఆర్థిక భరోసా నిస్తుంది

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల కు ఆర్థిక భరోసా నిస్తుందని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. మంగళవారం చింతల్‌లోని తన నివాస కార్యాలయంలో, సీ.ఎం.ఆర్.ఎఫ్ కింద మంజూరైన రూ.4 లక్షల విలువగల ఎల్.ఓ.సి పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి వర్గాల వైద్య అవసరాలకు సీ.ఎం.ఆర్.ఎఫ్" పథకం ఆర్థికంగా సహాయపడుతుందన్నారు.ఆర్థికంగా వెనుకబడ్డ వారు, పేదలు దిగువ మధ్య తరగతి వర్గానికి చెందిన వారు అత్యవసర వైద్య పరిస్థితుల్లో అప్పులు చేసి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి బాధితులకు ప్రభుత్వం తరఫున సీ.ఎం.ఆర్.ఎఫ్ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక చేయూత ఎంతో అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పాక్స్ చైర్మన్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, ఉద్యమకారుడు కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, గుబ్బాల లక్ష్మీనారాయణ, ఇస్మాయిల్, ప్రభాకర్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు..

## మహిళల సాధికారత కోసం కృషి చేయాలి

* **బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మహిళల సాధికారత కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు.ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం మహిళా అధ్యక్షురాలిగా మైలారం పద్మ నాయి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి , తోటి మహిళల సాధికారత కోసం కృషి చేసి సంఘంలో ,. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షులు గడిల వెంకటేశ్వర్లు నాయి, ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్. వెంకట్ నాయి గారి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ జె.రవీందర్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ నాయి, కోటి నాయి, షాపూర్ నగర్ నరేష్ నాయి, నరేందర్ నాయి, సిహెచ్.




వెంకటేష్ నాయి , దుండిగల్ మండలంలోని బోరంపేట నుండి మాజీ ప్రధాన కార్యదర్శి రాజు నాయి, బోరంపేట శ్రీను నాయి, స్వామి నాయి, కార్తీక్ నాయి, పోచంపల్లి సతీష్ నాయి, మల్లంపేట్ చింటూ నాయి, శివకుమార్ నాయి, దత్తాత్రేయ, మురళి నాయి సహా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఏ చదువుతున్న విద్యార్థులకు సామాజిక సృహ కల్పించడం హర్షనీయం

**రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమిరెడ్డి**






అమీర్పేట, (ప్రజాస్ఫూర్తి) : సీఏ చదువుతున్న విద్యార్థులకు సామాజిక సృహ కల్పించడం హర్షనీయమని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమిరెడ్డి అన్నారు. జాతీయ 77 వ చార్టెడ్ అకౌంట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమీర్ పేట్ లోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణ లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమిరెడ్డి పాల్గొని కళాశాల నిర్వాహకులను అభినందించారు. కళాశాల జోనల్ అడ్మిన్ ప్రిన్సిపల్ ఎస్ ఎం వలి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించేందుకు మాస్టర్ మైండ్స్ కృషి చేస్తుందన్నారు. సామాజిక స్పృహను కల్పించడంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా కార్యక్రమం లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మాస్టర్ మైండ్స్ అమీర్పేట్ బ్రాంచ్ ప్రిన్సిపల్ అశోక్, రెడ్ క్రాస్ సొసైటీ కన్వీనర్లు ఆయుబ్ ఖాన్, రమేష్, శ్రీనివాసరావు, జితేందర్ కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

* **: ఏపీ సీపీఐ కార్యదర్శి రామకృష్ణ**
* **విజయవాడలో పది వామపక్ష పార్టీల సమావేశం**
* **భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసనకు వామపక్షాల మద్దతు**
* **జులై 2 నుంచి గ్రామస్తులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామన్న రామకృష్ణ**



సోలార్ విద్యుత్ పరిశ్రమ కోసం ఉలవపాడు వద్ద చేపట్టిన బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో నిన్న పది వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. అలాగే ఉలవపాడు వద్ద చేపట్టిన బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన నిరసనకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించాయన్నారు. జులై 2న ఆ గ్రామాల్లో పర్యటించి వారికి మద్దతుగా ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటామని తెలిపారు. ప్రజలపై భారం పడే సోలార్ విద్యుత్ ఒప్పందాలను ఆదానీతో రద్దు చేసుకోవాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇండోసోల్, గ్రీన్ కో కంపెనీలు జగన్ బినామీలని ఆరోపించారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ కంపెనీలకే భూములు కట్టబెట్టాలని చూడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

### తీవ్ర ఆర్థిక సమస్యలతో ఉన్న

## సినీ నటి పాకీజాకు పవన్ కల్యాణ్ అండ

* **ఆర్థిక కష్టాల్లో ఉన్న నటి వాసుకి అలియాస్ పాకీజా**
* **రూ. 2 లక్షల చెక్కును అందజేసిన జనసేన నేతలు**
* **పవన్ కాళ్లు మొక్కుతానంటూ వాసుకి భావోద్వేగం**



ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సీనియర్ నటి వాసుకి (పాకీజా)కి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా నిలిచారు. ఆమె దీనస్థితి గురించి తెలుసుకుని చలించిపోయిన ఆయన, తక్షణ సాయంగా రూ. 2 లక్షలు అందజేశారు. ఈరోజు అమరావతిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పవన్ కల్యాణ్ తరఫున ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కలిసి నటి వాసుకికి రూ. 2 లక్షల చెక్కును అందించారు. ఇటీవల వాసుకి తన ఆర్థిక, అనారోగ్య సమస్యలను వివరిస్తూ, సాయం చేయాలని కోరుతూ విడుదల చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వీడియోలు పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా నటి వాసుకి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అండగా నిలిచిన పవన్ కల్యాణ్‌కు ఆమె కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు. "చిన్నవాడైనా పవన్ కల్యాణ్ ఎదురుగా ఉంటే ఆయన కాళ్లు మొక్కుతాను. నా కష్టాన్ని అర్థం చేసుకుని ఆదుకున్నారు. ఆయన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఆమె పేర్కొన్నారు. 1990వ దశకంలో పలు తెలుగు చిత్రాల్లో నటించిన వాసుకి, 'అసెంబ్లీ రౌడీ' సినిమాలో పోషించిన 'పాకీజా' పాత్రతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా, కాలక్రమేణా అవకాశాలు తగ్గిపోయి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జనసేన అధినేత ఆమెకు అండగా నిలవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## శ్రీవారి దర్శన టికెట్లు.. నకిలీ వ్యక్తుల్ని నమ్మి మోసపోవద్దు తితిదే

తిరుమల: శ్రీవారి టికెట్ల విషయంలో నకిలీ వ్యక్తుల్ని నమ్మి మోసపోవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) భక్తులకు విజ్ఞప్తి చేసింది. వైష్ణవ యాత్రాస్ పేరుతో ఓ వ్యక్తి ఫేస్‌బుక్ పేజీ నిర్వహిస్తూ శ్రీవారి అభిషేకం, ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఇప్పిస్తామని ప్రచారం చేస్తున్నారని, ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని తితిదే తెలిపింది. ఇలాంటి నకిలీ వ్యక్తులు, వెబ్‌సైట్‌లను నమ్మి మోసపోవద్దని.. టికెట్లను తితిదే అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని సూచించింది. దర్శన టికెట్ల పేరుతో భక్తులను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తితిదే హెచ్చరించింది.

# పార్టీ అంతర్గత అంశాలపై స్పందించిన కిషన్ రెడ్డి

* పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు
* బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
* రెండు పార్టీలు అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపణ
* మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని భారాస అప్పుల్లోకి నెట్టిందని విమర్శ
* ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఫైర్



కొత్త అధ్యక్షుడి ఎన్నిక విషయంలో పార్టీ అంతర్గత అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బీజేపీలో పదవులు ముఖ్యం కాదని ఆయన అన్నారు. "రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా ఫర్వాలేదు. మన పార్టీకి కార్యకర్తలే నిజమైన నాయకులు, వాళ్లే మన బలం. నాయకత్వంలో ఎవరున్నా అందరూ ఐక్యంగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు. రామచందర్‌రావు నాయకత్వంలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అందరూ సమష్టిగా పని చేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మంగళవారం హైదరాబాద్ శివార్లలోని మన్నెగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమీ చేయడం లేదని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ నిజాన్ని విమర్శకులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం తామేనని, రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# బాలానగర్ ఫ్లైఓవర్‌పై ఒకేచోట రెండు ప్రమాదాలు.. ఒకరి మృతి, ఎస్ఐకి గాయాలు

* బాలానగర్ ఫ్లైఓవర్‌పై జంట ప్రమాదాలు
* వేగంగా వచ్చిన కారు ఢీకొని పాదచారి అక్కడికక్కడే మృతి
* ప్రమాద స్థలంలో విచారణ జరుపుతున్న పోలీసులను ఢీకొట్టిన డీసీఎం
* ఈ ఘటనలో ఎస్ఐ వెంకటేశంకు తీవ్ర గాయాలు




పోలీసుల అదుపులోకి కారు, డీసీఎం డ్రైవర్లు

హైదరాబాద్ నగరంలోని బాలానగర్ ఫ్లైఓవర్‌పై మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒక ప్రమాదం జరిగిన చోటే మరికాసేపటికి మరో ప్రమాదం జరిగింది. ఈ జంట ప్రమాదాల్లో ఒకరు మరణించగా, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... బాలానగర్ పైవంతెనపై నడుచుకుంటూ వెళ్తున్న ఒక వ్యక్తిని అతివేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించడం ప్రారంభించారు. అయితే, పోలీసులు దర్యాప్తు చేస్తుండగానే ఊహించని రీతిలో మరో ప్రమాదం జరిగింది. అదే మార్గంలో వచ్చిన ఒక డీసీఎం వ్యాన్ అదుపుతప్పి, విచారణ జరుపుతున్న పోలీసు సిబ్బందిని ఢీకొట్టింది. ఈ రెండో ప్రమాదంలో బాలానగర్ ఎస్ఐ వెంకటేశంకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన తోటి సిబ్బంది, ఆయన్ను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ జంట ప్రమాదాలకు కారణమైన కారు డ్రైవర్‌ను, డీసీఎం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకే ప్రదేశంలో స్వల్ప వ్యవధిలో రెండు ప్రమాదాలు జరగడంతో ఫ్లైఓవర్‌పై కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. మరో మూడు రోజులు వానలే!

* బంగాళాఖాతంలో అల్పపీడనం.. కొనసాగుతున్న ఆవర్తనం
* తెలంగాణలోని 19 జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన
* ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల భారీ వానలు పడే అవకాశం
* గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక
* సముద్రంలోకి వెళ్లొద్దని మత్స్యకారులకు స్పష్టమైన ఆదేశాలు




బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనానికి తోడు, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరుగా హెచ్చరికలు జారీ చేశారు.

* **తెలంగాణలోని 19 జిల్లాలకు అలర్ట్**

ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణకు ప్రత్యేకంగా వర్ష సూచన జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

* **ఉత్తరాంధ్రపై అధిక ప్రభావం**

అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో అల్పపీడనం ఏర్పడుతున్నందున, దీని ప్రభావం ఉత్తరాంధ్రపై ఎక్కువగా ఉంటుందని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

* **మత్స్యకారులకు హెచ్చరికలు**

తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని సూచించారు. అధికారులు తదుపరి సూచనలు ఇచ్చే వరకు వేచి చూడాలని కోరారు.

# పాశమైలారం పేలుడు ఘటన.. 42కి చేరిన మృతుల సంఖ్య

* పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు
* మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
* శిథిలాల కింద మరిన్ని మృతదేహాలు
* కొనసాగుతున్న సహాయక చర్యలు
* దుర్ఘటనా స్థలాన్ని సందర్శించనున్న సీఎం రేవంత్ రెడ్డి
* రియాక్టర్ పేలుడే కారణమని ప్రాథమిక అంచనా



తెలంగాణలోని పాశమైలారంలోని సిగాచీ కెమికల్ పరిశ్రమలో సోమవారం సంభవించిన భారీ పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేడు సహాయక చర్యలు కొనసాగుతుండగా మృతుల సంఖ్య 42కి చేరింది. శిథిలాల కింద మరిన్ని మృతదేహాలు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు 12గా ఉన్న మృతుల సంఖ్య, మంగళవారం ఉదయానికి 34కి పెరిగింది. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు లభ్యం కావడంతో ఈ సంఖ్య మరింత పెరిగింది. "శిథిలాలను తొలగిస్తుండగా మరికొన్ని మృతదేహాలు బయటపడ్డాయి. సహాయక చర్యలు చివరి దశలో ఉన్నాయి" అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికాసేపట్లో ప్రమాద స్థలాన్ని సందర్శించనున్నారు.

* **గవర్నర్ దిగ్భ్రాంతి.. సహాయక చర్యలపై ఆదేశాలు**

ఈ విషాద ఘటనపై తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గవర్నర్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిషోర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పేలుడు బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని వెంటనే అందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేయలేని పని తెలంగాణలో చేస్తున్నాం: మంత్రి పొంగులేటి

* దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్న మంత్రి పొంగులేటి
* వరంగల్లు జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి
* రాయపర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్‌పై విమర్శలు



దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా పేదలకు సన్న బియ్యం ఇవ్వడం లేదని, కానీ తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి నిన్న వరంగల్లు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేశారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా పేద వర్గాలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చిందని, కానీ తమ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల మేలు కోసం భూభారతి చట్టం తీసుకువచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని చెప్పారు. పార్టీ గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని తెలిపారు.

# ప్రభుత్వ అలసత్వంతోనే పాశమైలారం ఘటన ఎమ్మెల్సీ కవిత

**: ఎమ్మెల్సీ కవిత**



పటాన్‌చెరు: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వ అలసత్వం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. పరిశ్రమల్లో సేఫ్టీపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బాధితులకు గ్రీన్ ఛానల్ ద్వారా సాయం అందించాలన్నారు.

# ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. బీవీ పట్టాభిరామ్.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ సంతానంలోని పదిహేను మందిలో ఒకరు. కౌమారదశలో కాలి వైకల్యంతో కలిగిన ఆత్మన్యూనతా భావాన్ని జయించి తనని తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతున్న రోజుల్లో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి నుంచి ఆ విద్యను నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఆహార సంస్థలో ఉద్యోగం చేసే రోజుల్లోనూ సాధన చేసేవారు. 1970 దశకం నాటికి స్వతంత్రంగా రెండుమూడు గంటలపాటు ప్రేక్షకులను కదలనీయకుండా ఇంద్రజాలం ప్రదర్శించే స్థాయికి పట్టాభిరామ్ ఎదిగారు.

**ప్రజలను జాగృతం చేస్తూ..**

1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలకు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారు. గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'రెండు రెళ్లు ఆరు'లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు శోభన్ బాబు, అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ, జయప్రద, రాజేంద్రప్రసాద్ తదితరులు ఆయనకు అభిమానులుగా మారిపోయారు. పలు పత్రికల్లో బీవీ పట్టాభిరామ్ వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు.

* **చంద్రబాబు, బండి సంజయ్, పవన్, లోకేశ్ సంతాపం**

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ మృతికి ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి బండి సంజయ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సంతాపం ప్రకటించారు. పట్టాభిరామ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చంద్రబాబు, లోకేశ్ అన్నారు. ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు.

# ఆ రోజు ఏం జరిగిందంటే?: ఆపరేషన్ సిందూర్-ట్రంప్ జోక్యంపై జైశంకర్ వివరణ

* భారత్-పాక్ యుద్ధం ఆపానన్న ట్రంప్ వాదనలో నిజం లేదన్న జైశంకర్
* అమెరికా అధ్యక్షుడి ప్రచారాన్ని తోసిపుచ్చిన జైశంకర్
* మే 9న పాక్ దాడి, భారత్ దీటైన జవాబు ఇచ్చిందన్న మంత్రి
* పాకిస్థానే నేరుగా కాల్పుల విరమణకు ముందుకొచ్చిందని వెల్లడి
* పహల్గామ్ దాడిని ఆర్థిక యుద్ధంగా అభివర్ణన
* ఉగ్రవాద నిర్మూలనలో అణు బెదిరింపులకు లొంగబోమని స్పష్టీకరణ

భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఆ ప్రచారాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ ఒప్పందం వెనుక జరిగిన అసలు వాస్తవాలను ఆయన ఒక అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే 'న్యూస్‌వీక్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జైశంకర్ మాట్లాడుతూ, మే 9వ తేదీ రాత్రి జరిగిన పరిణామాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. ఆ సమయంలో నేను



ప్రధానితో పాటే ఉన్నాను. పాకిస్థాన్ నుంచి భారత్‌పై పెద్ద ఎత్తున దాడి జరిగే ప్రమాదం ఉందని వాన్స్ హెచ్చరించారు. ఒకవేళ పాక్ దుస్సాహసానికి పాల్పడితే అందుకు తగిన రీతిలో, దీటుగా బదులిస్తామని మోదీ ఆయనకు స్పష్టం చేశారు" అని జైశంకర్ తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఘటనలను వివరిస్తూ "అనుకున్నట్టే ఆ రాత్రి పాకిస్థాన్ భారత్‌పై భారీ దాడికి తెగబడింది. అయితే, భారత బలగాలు ఆ దాడులను అత్యంత సమర్థవంతంగా, వేగంగా తిప్పికొట్టాయి" అని జైశంకర్ పేర్కొన్నారు. కాల్పుల విరమణకు దారితీసిన పరిస్థితులను ఆయన విడమరిచి చెప్పారు. ఆ మరుసటి రోజు ఉదయం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తనకు ఫోన్ చేసి, పాకిస్థాన్ చర్చలకు సిద్ధంగా ఉందని చెప్పినట్లు జైశంకర్ వెల్లడించారు. అయితే, ఆ తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుందని ఆయన అన్నారు. "అదే రోజు మధ్యాహ్నం, పాకిస్థాన్ మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) మేజర్ జనరల్ ఖసిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్‌కు నేరుగా ఫోన్ చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం పాటిద్దామని ప్రతిపాదించారు. అసలు జరిగింది ఇది" అని జైశంకర్ తేల్చిచెప్పారు. వాణిజ్యానికి, కాల్పుల విరమణకు భారత్ పరంగా ఎలాంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు.

### పహల్గామ్ దాడి ఆర్థిక యుద్ధమే

ఇదే ఇంటర్వ్యూలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని జైశంకర్ ఒక 'ఆర్థిక యుద్ధ చర్య'గా అభివర్ణించారు. కశ్మీర్ లోయలో అభివృద్ధిని, శాంతిని ఓర్వలేకే ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని ఆయన అన్నారు. "జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ దాడి చేశారు. మత ఘర్షణలు రెచ్చగొట్టేందుకు, పర్యాటకుల మతం అడిగి మరీ వారిని కాల్చి చంపారు. ఈ ఘటన తర్వాత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మేం నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. ఉగ్రవాదులకు, వారికి అండగా నిలిచే ప్రభుత్వాలకు భారత్ తగిన బుద్ధి చెబుతుందని, ఉగ్రవాదాన్ని అణిచివేసే క్రమంలో ఎలాంటి అణ్వస్త్ర బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## మేం అధికారంలోకి వస్తే ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం కాంగ్రెస్ మంత్రి ఖర్గే సంచలన ప్రకటన

* ఆర్‌ఎస్‌ఎస్ విద్వేషాలు వ్యాప్తి చేస్తోందని ఆరోపణ
* సంస్థకు వచ్చిన రూ. 250 కోట్ల నిధులపై దర్యాప్తు జరపాలని డిమాండ్
* రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకిస్తుందని విమర్శ
* బీజేపీ దాని కీలుబొమ్మలా మారిందన్న ప్రియాంక్ ఖర్గే



కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పై నిషేధం విధిస్తామని కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ దేశంలో విద్వేషాలను ప్రోత్సహిస్తోందని, రాజ్యాంగ పరిధికి లోబడి నడుచుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ "ఒకవేళ మేము కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే, ఆర్‌ఎస్‌ఎస్‌ను కచ్చితంగా నిషేధిస్తాం. గతంలో ఇందిరా గాంధీ గారు కూడా ఆ పని చేయలేదా? వారు కేవలం చట్టాన్ని అనుసరిస్తున్నట్లు పైకి కనిపిస్తారు. కానీ వారి అసలు ఉద్దేశాలు వేరు" అని అన్నారు. శాసనసభ్యుల పని చట్టాలు చేయడమని, తాము రాజ్యాంగానికి అతీతంగా ఎలాంటి చర్యలు తీసుకోమని ఆయన స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు అందిన రూ. 250 కోట్ల నిధులపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చేందుకు తప్పనిసరిగా దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. జూన్ 27న కూడా ప్రియాంక్ ఖర్గే ఆర్‌ఎస్‌ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి కీలక ఉద్యమాల్లో ఆ సంస్థ ఏమాత్రం పాల్గొనలేదని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ మొదటి నుంచీ రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని వ్యతిరేకిస్తోందని, ప్రస్తుతం బీజేపీ ఆ సంస్థకు ఒక కీలుబొమ్మలా మారిపోయిందని ఆయన ఆరోపించారు.

## మనిషి ఆయుష్షు 200 ఏళ్లు.. బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు

* యాంటీ ఏజింగ్ మందులే షెఫాలీ ప్రాణం తీశాయన్న ప్రచారంపై రాందేవ్ స్పందన..
* ఆహార నియమాలు పాటిస్తే 100 ఏళ్లు యంగ్‌గానే ఉంటారన్న యోగా గురు
* పైపై మెరుగుల కన్నా అంతర్గత ఆరోగ్యం ముఖ్యమని రాందేవ్ హితవు

ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా అకాల మరణం తర్వాత యాంటీ ఏజింగ్ మందుల వాడకంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మనిషి సహజ ఆయుష్షు వందేళ్లు కాదని, సరైన జీవనశైలిని పాటిస్తే 150 నుంచి 200 ఏళ్ల వరకు జీవించవచ్చని ఆయన అన్నారు. షెఫాలీ జరీవాలా మృతిపై



రాందేవ్ బాబా ఈరోజు ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిపై ఆందోళన వ్యక్తం చేశారు. "మానవ శరీరం ఒక అద్భుతం. కానీ మన మెదడు, గుండె, కాలేయంపై మనమే ఎక్కువ భారం మోపుతున్నాం. 100 ఏళ్లలో తినాల్సిన ఆహారాన్ని 25 ఏళ్లకే తినేస్తున్నాం" అని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు 60 ఏళ్లు దాటినా యోగా, ఆహార నియమాలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్లే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. గతంలో నటుడు సిద్ధార్థ్ శుక్లా, ఇప్పుడు షెఫాలీ జరీవాలా లాంటి యువతరం అకాల మరణాలపై స్పందిస్తూ, "వారి హార్డ్‌వేర్ బాగున్నా, సాఫ్ట్‌వేర్ లోపభూయిష్ఠంగా ఉంది. పైకి కనిపించే లక్షణాలు బాగానే ఉన్నా, శరీర వ్యవస్థ దెబ్బతింది" అని ఆయన వ్యాఖ్యానించారు. పైపై మెరుగుల కన్నా అంతర్గత ఆరోగ్యం చాలా ముఖ్యమని ఆయన సూచించారు. మరోవైపు, షెఫాలీ మృతి కేసులో పోలీసుల దర్యాప్తు కీలక విషయాలను వెల్లడించింది. ముంబైలోని ఆమె నివాసంలో పోలీసులు రెండు పెట్టెల నిండా మందులను గుర్తించారు. వాటిలో చర్మ సౌందర్యం కోసం వాడే గ్లూటాథియోన్, విటమిన్ సి ఇంజెక్షన్లు, ఎసిడిటీ మాత్రలు ఉన్నట్లు తేలింది. ఆమె గత ఏడెనిమిదేళ్లుగా వైద్యుల పర్యవేక్షణ లేకుండా సొంతంగానే ఈ యాంటీ ఏజింగ్ చికిత్సలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శరీరంలోని ప్రతి కణం సహజ జీవిత చక్రాన్ని దెబ్బతీసినప్పుడు గుండెపోటు వంటి ప్రమాదాలు జరుగుతాయని రాందేవ్ హెచ్చరించారు.

## కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ప్రకంపనలు..

### అనుచరులకు డీకే శివకుమార్ ఆదేశాలు

* నాయకత్వ మార్పు ఉండదని స్పష్టం చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం
* ఇది బీజేపీ కుట్రేనంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూర్జేవాలా ఆరోపణ
* సిద్ధరామయ్యకు లాటరీ తగిలిందన్న ఎమ్మెల్యే మాటలతో కొత్త వివాదం
* లీకైన వీడియోతో కర్ణాటక రాజకీయాల్లో మరింత పెరిగిన వేడి

కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి మార్పు ఖాయమని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ఆయన వర్గానికి చెందిన నాయకుల ప్రకటనలతో మొదలైన ఈ వివాదం, కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యంతో సద్దుమణిగిందని అనుకుంటున్న తరుణంలోనే మరో రూపంలో బయటపడింది. ఒక సీనియర్ ఎమ్మెల్యే ఫోన్ సంభాషణకు సంబంధించిన వీడియో లీక్ అవ్వడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. కొద్ది రోజులుగా కర్ణాటకలో ముఖ్యమంత్రిని మారుస్తారని, రెండు మూడు నెలల్లో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆయన మద్దతుదారుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. ఈ నేపథ్యంలో స్పందించిన డీకే శివకుమార్ ఆ వ్యాఖ్యలను ఖండించారు. "నా తరఫున ఎవరూ మాట్లాడొద్దు. పార్టీ ప్రయోజనాలే నాకు ముఖ్యం. మనమంతా 2028 ఎన్నికలపై దృష్టి పెట్టాలి. కాంగ్రెస్‌లో వర్గాలు లేవు. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో పనిచేస్తున్న ఒకే ఒక కాంగ్రెస్ ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తగా అధిష్ఠానం ఆదేశాలను పాటించడమే తన విధి అని ఆయన పేర్కొన్నారు. దీంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలాను హుటాహుటిన కర్ణాటకకు పంపింది. ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉండబోదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీ పథకాలను



అడ్డుకునేందుకే బీజేపీ ఇలాంటి నిరాధారమైన పుకార్లను సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.

### లీకైన వీడియోతో కొత్త కలకలం

అధిష్ఠానం, డీకే శివకుమార్ ఇద్దరూ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్న సమయంలోనే సీనియర్ నేత బీఆర్ పాటిల్‌కు సంబంధించిన ఒక వీడియో బయటకు రావడం కలకలం రేపింది. ఆ వీడియోలో ఆయన ఒకరితో ఫోన్‌లో మాట్లాడుతూ "సిద్ధరామయ్యకు లాటరీ తగిలింది. ఆయన్ను సోనియాగాంధీకి పరిచయం చేసిందే నేను. ఆయన అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయ్యారు. నాకు ఏ గాడ్ ఫాదర్ లేరు. నేను సూర్జేవాలాను కలిసి చెప్పాల్సింది చెప్పాను. ఏం జరుగుతుందో చూద్దాం" అని అనడం స్పష్టంగా వినిపించింది.

## అవును.. నేను అదృష్టవంతుడినే

### : లాటరీ తగిలిందన్న వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందన

* ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అదృష్టవంతుడంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వ్యాఖ్య
* అవును, అదృష్టం వల్లే ముఖ్యమంత్రిని అయ్యానని బదులిచ్చిన సిద్ధరామయ్య
* ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి జరిగిందంటూ పాటిల్ ఆరోపణలు
* మరికొందరు ఎమ్మెల్యేల నుంచి కూడా ప్రభుత్వ తీరుపై అసంతృప్తి గళం

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. సొంత పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శలు అధికార పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేవలం అదృష్టం వల్లే ఆ పదవిలో ఉన్నారంటూ ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు, ముఖ్యమంత్రి అంతే ఘాటుగా సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మంగళవారం మాట్లాడుతూ, "సిద్ధరామయ్యకు లాటరీ తగిలింది. ఆయన్ను సోనియాగాంధీకి పరిచయం చేసిందే నేను. ఆయన అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయ్యారు. నాకు ఏ గాడ్ ఫాదర్ లేరు. నేను పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సూర్జేవాలాను కలిసి చెప్పాల్సిందంతా చెప్పా. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియో బయటకు రావడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ విమర్శలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనదైన శైలిలో స్పందించారు. "అవును..నేను అదృష్టవంతుడినే. అందుకే ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్నాను"



అని బదులిచ్చారు.

### అసలేం జరిగింది?

తన నియోజకవర్గమైన అలంద్‌లో పేదలకు ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఇటీవల ఆరోపణలు చేశారు. అయితే, ఈ ఆరోపణలను గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఖండించారు. కేటాయింపులన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ వివాదం తర్వాత మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజు కాజే, బేలూర్ గోపాలకృష్ణ కూడా తమ ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కారు.

### రంగంలోకి అధిష్ఠానం

ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసమ్మతి స్వరాలు వినిపిస్తుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలాను బెంగళూరుకు పంపింది. ఆయన అసంతృప్త ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉండదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న ఊహాగానాల వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీలు నిలిచిపోవాలనే దురుద్దేశంతోనే బీజేపీ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

## చరిత్రలో తొలిసారి.. సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు!

* సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లలో కొత్త విధానం
* ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం కోటా కేటాయింపు
* జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్

దేశ అత్యున్నత న్యాయస్థానం భారత సుప్రీంకోర్టు చరిత్రలో ఒక కీలకమైన, చారిత్రక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు తొలిసారిగా, తన సిబ్బంది నియామకాలు మరియు పదోన్నతుల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు రిజర్వేషన్ల విధానాన్ని అధికారికంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం దిశగా సుప్రీంకోర్టు ఒక బలమైన ముందడుగు వేసినట్లయింది. ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తూ జూన్ 24న సుప్రీంకోర్టు ఒక అంతర్గత సర్క్యులర్‌ను



జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం, రిజర్వేషన్ల విధానం జూన్ 23, నుంచే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. దీని ప్రకారం, కోర్టులో ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీ వర్గాలకు 15 శాతం, ఎస్టీ వర్గాలకు 7.5 శాతం కోటా వర్తిస్తుంది. ఈ రిజర్వేషన్ల అమలు కోసం రూపొందించిన 'మోడల్ రిజర్వేషన్ రోస్టర్', సంబంధిత రిజిస్టర్ల వివరాలను కోర్టు అంతర్గత నెట్‌వర్క్ అయిన 'సుప్‌నెట్'లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ రిజర్వేషన్ విధానం సుప్రీంకోర్టులోని రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, ఛాంబర్ అటెండెంట్లు వంటి పలు స్థాయిల్లోని పోస్టులకు వర్తించనుంది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. విడుదల చేసిన రిజర్వేషన్ జాబితాలో ఏవైనా లోపాలు ఉన్నాయని భావిస్తే, సిబ్బంది తమ అభ్యంతరాలను నేరుగా రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి హయాంలో ఈ చారిత్రక నిర్ణయం వెలువడటం గమనార్హం. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించిన రెండో వ్యక్తిగా జస్టిస్ గవాయి చరిత్ర సృష్టించారు. ఆయన పదవీకాలంలోనే అత్యున్నత న్యాయస్థానంలో రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## అప్రమత్తంగా వ్యవహరించిన మదుపరులు..!

### స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ గడువు దగ్గరపడుతుండడంతో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,685.66 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. అయితే, పొద్దంతా మార్కెట్లు పెరుగుతూ తగ్గుతూ వచ్చాయి. ఇంట్రాడేలో 83,572.51 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,874.29 పాయింట్ల మార్క్‌ని తాకింది. చివరకు 90.83 పెరిగి 83,697.29 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24.75 పాయింట్లు పెరిగి 25,541.80 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్వల్ప నష్టాలతో ముగియడంతో విస్తృత సూచీల ఏడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. రంగాలవారీగా చూస్తే.. ఎఫ్ఎంసీజీ, మీడియా, పవర్ 0.4-1.3 శాతం వరకు తగ్గాయి. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.7శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి. అపోలో హాస్పిటల్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఆసియన్ పెయింట్స్ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించాయి.

యాక్సిస్ బ్యాంక్, నెస్లే, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్, ట్రెంట్ నష్టపోయాయి. సిగాచి ఇండస్ట్రీస్ షేర్లు 5శాతం పతనమయ్యాయి. తెలంగాణ సంగారెడ్డి జిల్లాలో పాశమైలారంలోని ప్లాంట్‌లో రియాక్టర్ పేలడంతో 30 మందికిపైగా చనిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కంపెనీ షేర్లు వరుసగా రెండోరోజు పడిపోయాయి. పునర్నిర్మాణ ప్రణాళిక నేపథ్యంలో గాబ్రియేల్ ఇండియా షేర్లు 20శాతం పెరిగాయి. రూ.989 కోట్ల విలువైన ఆర్డర్‌ల విజయంతో కల్పతరు ప్రాజెక్ట్స్ షేర్లు 2శాతం వృద్ధి చెందాయి. మోర్గాన్ స్టాన్లీ డౌన్‌గ్రేడ్ తర్వాత డిక్సన్ టెక్నాలజీస్ షేర్లు పతనమయ్యాయి. క్యూ1 డిపాజిట్ల తర్వాత కరూర్ వైశ్యా బ్యాంక్ షేర్లు 2 శాతం పెరిగాయి. ఇక బీఎస్‌సీలో 150 కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయిని తాకాయి. ఇందులో జేకే లక్ష్మీ సిమెంట్, ఎండ్యూరెన్స్ టెక్నాలజీస్, సిటీ యూనియన్ బ్యాంక్, అపోలో హాస్పిటల్స్, ఫెడరల్ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్, లారస్ ల్యాబ్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, దీపక్ ఫెర్టిలైజర్స్, నవీన్ ఫ్లోరిన్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఎంసీఎక్స్ ఇండియా, హ్యుందాయ్ మోటో, ఎల్‌టీ ఫైనాన్స్, రామ్‌కో సిమెంట్స్, మాక్స్ హెల్త్‌కేర్, మాక్స్ ఫైనాన్షియల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, పూనావాలా ఫిన్‌కార్ప్ ఉన్నాయి.

## ఎక్కువ గంటలు పనిచేయొద్దు..

### ఉద్యోగులకు ఇన్ఫీ కీలక సూచన




**న్యూఢిల్లీ:** దేశం పురోగతి సాధించాలంటే యువత 70 గంటలు పనిచేయాల్సిందేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో పని గంటలపై ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు తాజాగా కీలక సూచన చేసింది. నిర్దేశిత పనివేళలు ముగిసిన తర్వాత అదనంగా పని చేయొద్దని, ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉద్యోగులకు ఈమెయిల్స్ ద్వారా సూచిస్తోంది.

ఉద్యోగులు అదనపు పని గంటలు, ఒత్తిడి, నిద్రలేమి కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు సంస్థ గుర్తించింది. ఈ మేరకు ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ కీలక సూచన చేసింది. ఇన్ఫోసిస్ ప్రస్తుతం హైబ్రిడ్ పద్ధతిని అవలంభిస్తోంది. దీని ప్రకారం ఇన్ఫీ ఉద్యోగులు నెలకు పది రోజులు ఆఫీసుకు రావాల్సి ఉంటుంది. ఉద్యోగులు వారంలో ఐదు రోజులు.. రోజుకు సగటున 9:15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ సమయం పనిచేస్తున్న వారిని హెచ్‌ఆర్ విభాగం గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఈమెయిల్స్ పంపుతోంది. ముఖ్యంగా రిమోట్‌గా పనిచేస్తున్న వారికి ఏ రోజు ఎన్ని గంటలు పనిచేసిందీ ఈమెయిల్‌లో పేర్కొంటోంది. పనివేళలు ముగిసిన వెంటనే విశ్రాంతి తీసుకోవాలని, పని మధ్యలో విరామం తప్పనిసరి అని ఆ మెయిల్స్‌లో సూచిస్తోంది. పని గంటల తర్వాత ఆఫీస్ పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తోంది. నారాయణమూర్తి వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ ఉద్యోగుల వ్యక్తిగత ఆరోగ్యం, వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై ఇన్ఫీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

## బాబోయ్ బంగారం..!

### భారీగా పెరిగిన ధర..



**న్యూఢిల్లీ:** పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. ఇటీవల వరుసగా తగ్గిన మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో నగరంలో భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల పుత్తడి ధర రూ.1200 పెరిగి తులం ధర రూ.38,670కి చేరింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. 99.9 శాతం ప్యూరిటీ గోల్డ్ రేటు సోమవారం తులానికి రూ.97,470 పలికింది. మరో వైపు 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,100 పెరిగి తులానికి రూ.98,150కి చేరుకుంది. అమెరికాలో పెరుగుతున్న ఆర్థిక లోటు ఆందోళనలు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ట్యాక్స్ కట్-స్పెండింగ్ బిల్‌పై మార్కెట్ దృష్టి సారించిన నేపథ్యంలో యూఎస్ డాలర్ పతనం కావడంతో పెట్టుబడిదారులను బంగారం ఆకర్షిస్తుందని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా పేర్కొన్నారు.

జులై 9కి ముందే జపాన్‌పై కొత్త సుంకాలను విధించనున్నట్లు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా వెండి ధర సైతం భారీగానే పెరిగింది. రూ.2వేలు పెరగడంతో కిలో ధర రూ.రూ.1,04,800కు చేరింది. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 44.01 డాలర్లు పెరిగి 3,346.92 డాలర్లకు చేరింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. డాలర్ బలహీనపడుతుండడంతో.. సురక్షితమైన పెట్టుబడిగా బంగారం కొనుగోళ్లను ఆకర్షిస్తోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. ఈ వారం సెంటిమెంట్ ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 22 క్యారెట్ల గోల్డ్ తులం రూ.90,200 పలుకుతుండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.98,400గా ఉన్నది. మరో వైపు వెండి కిలోకు రూ.1.20లక్షలు పలుకుతున్నది.




# ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో స్మృతి మందాన

దుబాయ్: భారత మహిళా క్రికెటర్ స్మృతి మందాన ఐసీసీ టీ20 ర్యాంకుల్లో టాప్ మూడవ బ్యాటర్‌గా నిలిచింది. వన్డేల్లో ఇప్పటికే వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఆమె.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో స్మృతి మందాన తన పాయింట్ల పట్టికను మెరుగుపరుచుకున్నది. ఫస్ట్ టీ20లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కావడంతో ఆ బాధ్యతలను స్మృతి మందాన పోషించింది. మందాన తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టింది. కేవలం 62 బంతుల్లోనే ఆమె 112 రన్స్ చేసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఇండియా 97 రన్స్ తేడాతో విజయం సాధించింది. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ స్మృతి మందాన తన కెరీర్‌లో అత్యుత్తమంగా 771 రేటింగ్ పాయింట్లు సాధించింది. దీంతో ఆమె మూడవ ర్యాంక్‌లో నిలిచింది. వెస్టిండీస్‌కు చెందిన హేలే మాథ్యూస్ 774, ఆస్ట్రేలియా బ్యాటర్ బేత్ మూనీ 794 పాయింట్లతో రెండో, మొదటి స్థానల్లో నిలిచారు. భారతీయ మహిళా క్రికెటర్లలో షఫాలీ వర్మ, హర్లిన్ డియోల్.. రాణించారు. షఫాలీ వర్మ 13వ ర్యాంక్‌లో నిలిచింది. బౌలర్లలో పాకిస్తాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్.. టీ20ల్లో టాప్‌లో నిలిచింది. 44 రేటింగ్ పాయింట్లతో ఆమె అగ్ర స్థానంలో ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది.

## తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యమే కారణం

### పోలీసులను తప్పుపట్టలేం..!




**బెంగళూరు:** భారత క్రీడా చరిత్రలో రెండో దుర్ఘటనగా పేర్కొనదగిన చిన్నస్వామి తొక్కిసలాట పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపిన విషయం తెలిసిందే. తమ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ గెలుపొందిన తమ జట్టును చూసేందుకు పోటెత్తిన ఫ్యాన్స్‌లో 11 మంది అసువులు బాశారు. జూన్ 4న జరిగిన ఈ సంఘటనపై యావత్ భారతం ఆర్సీబీని దుమ్మెత్తిపోయగా తాజాగా కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ కూడా సంచనల వ్యాఖ్యలు చేసింది. తొక్కిసలాటకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యానిదే తొలి బాధ్యత అని క్యాట్ తెలిపింది.

ఐపీఎల్ ఛాంపియన్‌గా అవతరించిన ఆర్సీబీ మరుసటి రోజే కర్నాటకలో విజయయాత్రకు పిలుపునిచ్చింది. విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకూ విక్టరీ పరేడ్‌లో నిర్వహిస్తామని, అభిమానులు భారీగా తరలిరావాలని బెంగళూరు ఫ్రాంచైజీ కోరింది. కానీ, అందుకు తగిన భద్రతా ఏర్పాట్లను మాత్రం చేయలేదు. అందుకే తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యమే ప్రథమ దోషి అని క్యాట్ అభిప్రాయపడింది.

'ఐపీఎల్ విజేతగా నిలిచిన తర్వాత బెంగళూరు టీమ్ ఎక్స్ వేదికగా విక్టరీ పరేడ్ పోస్ట్ పెట్టింది. ఆ పోస్ట్ చూసిన ఫ్యాన్స్ జూన్ 4న చిన్నస్వామికి భారీగా తరలివచ్చారు. 35 వేల సామర్థ్యం ఉన్న స్టేడియానికి 2.5లక్షల మంది రావడంతో పోలీసులు వాళ్లను అదుపు చేయలేకపోయారు. పైగా వాళ్లకు అంతమందిని నియంత్రించేందుక అవసమరైన బలగాలను సమకూర్చుకునే సమయం కూడా లేకపోయింది. అయినా పోలీసులేమీ దేవుళ్లు కాదు కదా.. అంతా క్షణాల్లో అదుపు చేయడానికి. సో.. ఈ దుర్ఘటనకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని చెబుతూ ఆర్సీబీ యాజమాన్యం తప్పించుకోవడానికి లేదని క్యాట్ వెల్లడించింది. చిన్నస్వామి తొక్కిసలాట తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి.

భారత క్రికెట్ నియంత్రణ మండలి సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా సైతం ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా విక్టరీ పరేడ్ జరపడాన్ని ఖండించాడు. దాంతో, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కర్నాటక ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఫలితంగా ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ ప్లానింగ్ సంస్థపై కేసులు నమోదయ్యాయి. అనంతరం కేసీసీఏ సెక్రటరీ ఏ శంకర్, కోశాధికారి జయరామ్ రాజీనామా చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బీసీసీఐ మార్గదర్శకాలు జారీ చేసింది.

## ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వేలానికి రిషబ్ పంత్




**న్యూఢిల్లీ:** గత ఏడాది ఐపీఎల్ వేలంలో రిషబ్ పంత్ 27 కోట్లకు అమ్ముడుపోయాడు. లక్నో సూపర్ గెయింట్స్ జట్టు అతన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో కూడా అతను వేలానికి సిద్ధం అయ్యాడు. ఆ వేలంలోనూ అతనికి భారీగా ధర పలికే అవకాశం ఉన్నది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ కోసం మొత్తం 8 జట్లు పోటీపడనున్నాయి. దీంట్లో రిషబ్ పంత్ తో పాటు ఐపీఎల్‌లో ఆడిన కొందరు స్టార్ ఆటగాళ్లు వేలానికి ఉన్నారు. ప్రియాన్ష్ ఆర్యా, దిగ్వేశ్ రాథీ లాంటి క్రికెటర్లు కూడా ఉన్నారు. జూలై 6, 7 తేదీల్లో ఆటగాళ్ల వేలం జరగనున్నది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మరో రెండు జట్లు కొత్తగా జతకూడినట్లు ఇవాళ డీడీసీఏ ప్రకటించింది. దీంతో ఆ జట్ల సంఖ్య 8కి చేరింది. రిషబ్ పంత్, దిగ్వేశ్, ప్రియాన్ష్, ఇశాంత్ శర్మ, ఆయుష్ బదోనీ, హర్షిత్ రాణా, హిమ్మత్ సింగ్, సుయాశ్ శర్మ, మయాంక్ యాదవ్, అనుజ్ రావత్ డీపీఎల్‌లో ఆడనున్నారు.

# పంచ్ పడితే పతకమే..

### జాతీయ పోటీల్లో బాక్సర్ మీర్జా అలీ బేగ్ దూకుడు

**చార్మినార్:** రింగ్ లోకి దిగి పంచ్ విసిరితే ప్రత్యర్థికి చుక్కలే.. చదువుల్లోనే కాదు.. ఆటల్లోను ముందు వరుసలో ఉంటామని నిరూపిస్తున్నారు పాత బస్తీ విద్యార్థులు. మెరుగైన ప్రదర్శన ద్వారా క్రీడా లోకంలో గుర్తింపు సాధిస్తూ తోటి విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నారు. ఆటపై ఇష్టం.. నిరంతరం సాధన..ఓరిమితో కృషి చేసేవారి విజయ పరంపరకు ఆర్థిక పరిస్థితులు అడ్డురావని నిరూపిస్తున్నారు. ఒకవైపు ఆటల్లో దూసుకుపోతు.. మరోవైపు చదువులోను విశేషంగా రాణిస్తు అందరి చేతా ఔరా.. అనిపించేలా చేస్తున్నాడు మీర్జా అలీ బేగ్.

చిన్నతనం నుంచే మీర్జా అలీ బేగ్‌కు బాక్సింగ్ అంటే ఇష్టం. కొడుకు ఆసక్తి గుర్తించిన తండ్రి.. జాతీయ క్రీడాకారుడ్కైన సయ్యద్ హబీబ్ ముస్తాఫాను సంప్రదించాడు. మీర్జా అలీ బేగ్‌కు మెలకువలను నేర్పి అతన్ని ప్రోత్సహించాడు కోచ్. అవకాశాన్ని అందిపుచ్చుకున్న మీర్జా ఆలీబేగ్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలో పాల్గొని పతకాలు గెలుచుకున్నాడు. కోచ్ హబీబ్ నమ్మకాన్ని నిలకబెట్టాడు. బరిలో దిగిన ప్రతి బౌట్‌లోనూ పతకాలు ఒడిసి పట్టాడు. వరల్డ్ చాంపియన్, మేటి బాక్సర్ నికత్ జరిన్ తరహా బాక్సింగ్‌లో దూసుకుపోతు తెలంగాణ రాష్ట్ర పేరును జాతియ స్థాయిలో మెరిపిస్తున్నాడు.

బాక్సింగ్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గనే అవకాశం దక్కించుకున్నాడు మీర్జా ఆలీ బేగ్. తండ్రి నుంచి స్ఫూర్తి పొందిన ఇతడు ఎప్పటికప్పుడు తన ప్రతిభను మెరుగులు దిద్దుకుంటూ మరింతగా రాణించడానికి




పాఠశాల అనంతరం మిగిలిన సమయాన్ని సాధన కోసం కేటాయిస్తూ రాటుదేలుతున్నాడు. పాతబస్తీ బండ్లగూడ వద్దనున్న టటసింగ్ సన్ హై స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మిర్జా ఆలీ బేగ్, 5వ తరగతి చదువుతున్నప్పటి నుంచే బాక్సింగ్‌లో సాధన ప్రారంభించాడు.

తండ్రి మీర్జా జావేద్ బేగ్, చెల్లి, ఇద్దరూ క్రీడల్లో ప్రతిభావంతులే. క్రీడకారులకు దక్కుతున్న గౌరవాన్ని దగ్గర నుంచి గమనించిన మీర్జా ఆలీ బేగ్ ఎలాగైన తనూ ఈ ఆటలో సత్తాచాటాలని నిర్ణయించుకున్నాడు. ఆ దిశగా అడుగులు వేసి రెండేళ్లలో రాష్ట్ర స్థాయి పోటీల్లో తన సత్తా చాటాడు. మొదటి సంవత్సరమే బంగారు, కాంస్య పతాకం సాధించి తన పట్టుదలను నిరూపించాడు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన ప్రతిభ చాటుతూ పలువురి ప్రంశలు అందుకుంటున్నాడు.

2025 జూన్ 19 నుంచి 25వరకు హార్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో జరిగిన జాతియ స్థాయి పోటీలో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తు అండర్ 52, 54, కేజీ బరిలోకి దిగి కాంస్య పతకం అందుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అనేక పోటీలో పాల్గొని బంగారు పతకాలు సాధించాడు.

ఆటలో విజయం సాధించడానికి మెరుగైన ప్రదర్శన చేయడానికి నిర్దిష్ట విధానం ఏమీ ఉండదు. పట్టుదల, అంకితభావంతో ప్రయత్నిస్తే ఏ క్రీడల్లోన్కైనా విజయాలను సాధించవచ్చు, క్రీడల్లో గెలుపోటములు జీవితంలో కూడా ఎన్నో పాఠాలు నేర్పుతాయని కోచ్ హబీబ్ అన్నారు.

## 'ఉస్తాద్ భగత్‌సింగ్' సెట్స్‌లో సందడి చేసిన మెగాస్టార్



టాకీస్: పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా స్టార్ డైరెక్టర్ హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా షూటింగ్ రీసెంట్‌గా పునః ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో పవన్ కల్యాణ్‌పై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెట్స్‌లోకి అనుకోని అతిథి వచ్చారు. ఆయన మరెవరో కాదు, మెగాస్టార్ చిరంజీవి. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. అయితే సోమవారం షూటింగ్ సమయంలో చిరంజీవి సెట్స్‌లో సందడి చేశారు. చిత్రీకరణను దగ్గరుండి వీక్షించారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో బయటకు వచ్చింది. ఇందులో చిరు షూటింగ్ సీన్‌ను చూస్తుండగా, పవన్ కళ్యాణ్ పక్కనే ఉన్నారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనికి మెగా బ్రదర్స్ అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. అలాగే త్వరగా సినిమా అప్డేట్స్ కావాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు.

## ఈ వయస్సులోను ఇంత అందమా..

### తట్టుకోలేకపోతున్నామంటున్న కుర్రాళ్లు

టాకీస్: తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ముద్దుగుమ్మ జెనీలియా డిసౌజా. ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల సరసన ఆమె నటించిన చిత్రాలు అభిమానుల హృదయాల్లో నిలిచిపోయాయి. 1987, ఆగస్టు 5న జన్మించిన జెనీలియా, 'తుజే మేరీ కసమ్' సినిమాతో బాలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఇందులో హీరోగా రితేష్ దేశ్ ముఖ్ నటించారు. మొదటి సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఆ ప్రేమ చాలా కాలం కొనసాగి, 2012లో ఇరు కుటుంబాల సమక్షంలో వారు పెళ్లి చేసుకున్నారు. తెలుగులో 'బాయ్స్' సినిమాతో అరంగేట్రం చేసిన జెనీలియా, 'బొమ్మరిల్లు', 'సాంబ', 'ఆరెంజ్', 'నా అల్లుడు' వంటి హిట్ చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఆమె చేసిన పాత్రలు ఎంతో సహజంగా ఉండటంతో అభిమానులు జెనీలియాని తెలుగింటి అమ్మాయిగా భావించారు. ఇక జెనీలియా భర్త రితేష్ దేశ్ ముఖ్ రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన తండ్రి విలాస్ రావ్ దేశ్ ముఖ్ మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి. మొదట్లో వారి ప్రేమకు కుటుంబం ఒప్పుకోలేదు. కానీ జెనీలియా మంచితనానికి ఫిదా అయిన విలాస్ రావ్ వారి ప్రేమని అంగీకరించి పెళ్లి చేశాడు. ఇప్పుడు ఈ జంటకు ఇద్దరు కుమారులు ఉన్నారు.పెళ్లి తర్వాత కొన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్న జెనీలియా, ఇటీవలి కాలంలో బాలీవుడ్ సినిమాలతో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం హిందీలో వరుసగా ప్రాజెక్ట్స్ చేస్తూ అలరిస్తూ ఉంది. ఇక తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందం, ఆకర్షణలో ఆమె ఇప్పటికీ అప్సరసే అన్నంతగా మెరిసిపోతుంది.ఈ ఏజ్‌లో కూడా జెనీలియా ఇంత గ్లామర్ ఎలా మెయింటైన్ చేస్తుంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం జెనీలియా పిక్స్ సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి.

## ట్రైలర్స్‌తో దూసుకుపోతున్న తమ్ముడు




టాకీస్: టాలీవుడ్‌స్టార్ హీరో నితిన్ 'తమ్ముడు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. చివరిగా రాబిన్ హుడ్‌తో ప్రేక్షకులని పలకరించగా, ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దీంతో ఇప్పుడు దర్శకుడు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తమ్ముడు సినిమా చేశారు. ఇది జూలై 4న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇంటర్వ్యూలు, ప్రీ రిలీజ్ ఈవెంట్స్ ఇలా సినిమాపై ఆసక్తిని కలిగించే ప్రయత్న చేశారు. మరో రెండు రోజులలో తమ్ముడు చిత్రం విడుదల కానుండగా, చిత్ర బృందం రిలీజ్ ట్రైలర్ కొద్ది సేపటి క్రితం విడుదల చేసింది. నేను పుట్టినప్పుడే మా అమ్మ చనిపోయింది.. అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది.నాకు అమ్మ అయిన నాన్న అయిన అన్నీ మా అక్కే అనే డైలాగ్ ఈ మూవీ సిస్టర్ సెంటిమెంట్‌తో రూపొందుతుంది అని తెలియజేస్తుంది. ట్రైలర్ ఎమోషన్స్, యాక్షన్ తో నిండిపోయింది. మూవీపై భారీ అంచనాలే పెంచింది. ఈ చిత్రం నితిన్‌కి తప్పక మంచి హిట్ ఇస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇందులో సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, స్వాశిక కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్రంలో నితిన్ కి అక్కగా ఒకప్పటి హీరోయిన్ లయ నటిస్తుండగా, ఈ చిత్రంతోనే రీ ఎంట్రీ ఇస్తుంది. మూవీకి సంబంధించిన విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ లకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు ఈ ట్రైలర్ కూడా ఆకట్టుకుంది. అయితే పవన్‌కు వీరాభిమాని అయిన నితిన్ ఇదే టైటిల్‌తో సినిమా చేశారు. సినిమా టైటిల్ ఒక్కటే అయినప్పటికీ స్టోరీలు మాత్రమ వేర్వేరుగా ఉండనున్నాయి. అయితే ఈ సినిమా టైటిల్ వాడడం పట్ల తాను సంతోషంగా లేనని నితిన్ రీసెంట్‌గా పాల్గొన్న ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ కథకు ఆ టైటిల్ మాత్రమే న్యాయం చేస్తుందని ప్రొడ్యూసర్ దిల్ రాజు, డైరెక్టర్ వేణు శ్రీరామ్ భావించి పట్టుబట్టి మరీ తనను ఒప్పించినట్టు నితిన్ చెప్పుకొచ్చారు.



## రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రం

### గ్రామీణ నేపథ్యంలో 'కొత్తపల్లిలో ఒకప్పుడు'

టాకీస్: ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రయోగాలు చేస్తున్న రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ సినిమా పేరే ఆసక్తికరంగా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అని పెట్టారు. గ్రామీణ నేపథ్యం తో సాగే ఈ భావోద్వేగ కథ వెనక సున్నితమైన సామాజిక సందేశం కూడా ఉంది. ఈ చిత్రానికి ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదివరకే 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి చిన్న సినిమాలతో పెద్ద సెన్సిబుల్ హిట్స్ అందించిన ప్రవీణ, ఈసారి మరింత లోతైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కథలో గ్రామీణ యువకుడు తన జీవితంలో ఎదురైన ఓ అనూహ్య సంఘటన, తరువాత ఎదుర్కొన్న ప్రయాణాన్ని చూపించ నుంది. మారుతున్న సమాజంలో గ్రామీణ సంస్కృతి, విలువలు, సంబంధాలు ఎలా మాయమవుతున్నాయనే విషయాన్ని ఈ చిత్రం లోతుగా చూపనుంది. కాగా ఈ మూవీలో రానా, పూర్తి గ్రామీణ గెటప్‌లో కనిపించనున్నాడు. ఇప్పటి వరకు చూడని ఓ మెలోడ్రామా టిక్,




ఎమోషనల్ కోణంలో రానా నటనను ఈ సినిమాలో చూడబోతున్నాం. మేకర్స్ చెబుతున్న దానివల్ల ఇది రానా కెరీర్‌లో కొత్త మలుపు కావొచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకు లాస్ ఏంజిల్స్‌కి చెందిన అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ విజువల్స్ అందిస్తుండగా, ఈ 'కొత్తపల్లిలో ఒకప్పుడు' త్వరలోనే థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే టైటిల్ పాయింట్, కాన్సెప్ట్ విషయంలో మంచి బజ్ క్రియేట్ అవ్వగా. ఇప్పుడు చూడాల్సిందల్లా ఈ కొత్త ప్రయోగం రానాకు హిట్ అందిస్తుందా లేదా అన్నది.

## ఇండియన్ సినిమాను ఉన్నతంగా నిలిపే యత్నం

### ప్రత్యేకంగా సిద్ధం అవుతున్న వార్-2



టాకీస్: ఇండియన్ సినిమాను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యష్ రాజ్ ఫిలిమ్స్, బాలీవుడ్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ సిద్ధమవుతున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ , గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కలయికలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2' ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. వార్ 2లో యాక్షన్ ఒక్కటే కాదు? ఎనర్జీ పరంగా దుమ్మురేపే డాన్స్ నెంబరు కూడా ఉండబోతోంది. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో అత్యుత్తమ డ్యాన్సర్లు అని పేరొందిన ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరు కలిసి ఒకే స్క్రీన్‌పై స్టెప్పులేస్తే, అది రొటీన్ సాంగ్ మాదిరిగా కాకుండా డైనమిక్ మ్యూజికల్ ట్రీట్‌గా ఉంటుందని అంటున్నారు. ఇటీవల యష్ రాజ్ స్టూడియోస్‌లో ఈ సాంగ్ కోసం ఇద్దరు హీరోలు రిహార్సల్స్ చేయగా,ఈ రోజు నుంచే షూటింగ్ ప్రారంభమైంది. ఈ డాన్స్ నంబర్‌కి టాప్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ పలు రోజులు కొనసాగనుండగా, ఇందులో హైవోల్టేజ్ ఎనర్జీ, ఇంటెన్స్ స్టెప్స్ ఉండనున్నాయన్న టాక్




ఫిలింనగరంలో హీట్ పెంచుతోంది. వార్ 2ను కేవలం యాక్షన్ థ్రిల్లర్‌గా కాకుండా, అన్ని విభాగాల్లోనూ స్టాండర్డ్స్‌ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్టీఆర్ ? హృతిక్ మధ్య ÷ట్స్ అన్నీ ఏకంగా హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతుండగా, ఇప్పుడు డ్యాన్స్ ఎలిమెంట్ ఈ సినిమాను మరో లెవెల్‌కి తీసుకెళ్లనుంది. ఇద్దరికి సింగిల్ టేక్ డ్యాన్సర్లు అనే పేరుంది. ఎన్టీఆర్ తన బ్లాస్టింగ్ డ్యాన్స్ మూవ్‌లతో తెలుగులో తిరుగులేని డ్యాన్సర్‌గా గుర్తింపు పొందగా, హృతిక్ రోషన్ బాలీవుడ్‌లో తన స్టైలిష్ స్టెప్స్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. అలాంటి స్టార్లను ఒకే పాటలో చూడడం అంటే, అభిమానులకే కాదు , ప్రేక్షకులందరికీ అది జీవితాంతం మరిచిపోలేని విజువల్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. డ్యాన్స్ సీక్వెన్స్‌తో పాటు పవర్‌ప్యాక్డ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్న ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ 'దేవర', హృతిక్ ' ÷టైర్' తర్వాత వీరిద్దరు కలిసి వార్ 2 చిత్రం చేస్తున్నారు. ఆగస్ట్‌లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## చీర కట్టులో చక్కనమ్మ..

### అదరగొట్టిన మిథిలా పాల్కర్



టాకీస్: ఓరి దేవుడా సినిమాతో తెలుగుతెరకు పరిచయమైంది మిథిలా పాల్కర్.. ఈ సినిమాలో మిథిలా అందంతో , క్యూట్ స్టైల్ తో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది.ఈమె స్టైల్ తో అభిమానులను మాత్రం గట్టిగానే సంపాదించి ఈ ముంబై ముద్దుగుమ్మ. ఈ చిన్నదానికి ఫ్యాన్ ఫాలోయింగ్ గట్టిగానే ఉంది. సినిమా అభిమానులకు 'కారవాన్', వెబ్ ప్రియులకు 'లిటిల్ థింగ్స్' తెలిస్తే.. మిథిలా పాల్కర్ తెలిసినట్టే! ఆమె నటనకు ఎంత మంది ఫ్యాన్స్ ఉన్నారో.. ఆమె ఫ్యాషన్‌కూ అంతేమంది ఫాలోవర్స్ ఉన్నారు. సోషల్ మీడియాలో ఈ చిన్నదాని ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది. ఇక తెలుగులో చేసింది ఒకే ఒక్క సినిమా అయినా కూడా ఈ బ్యూటీ మంచి క్రేజ్ తెచ్చుకుంది. అంతకు ముందు 'కట్టి బట్టి' మూవీ ద్వారా హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఆ సినిమాలోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది ఈ అందాల ముద్దుగుమ్మ. తెలుగులో విశ్వక్ సేన్ నటించిన ఓరి దేవుడా సినిమాతో పరిచయం అయ్యింది. ఓరిదేవుడా సినిమా మంచి విజయాన్ని అందుకున్నా.. ఈ చిన్నదానికి ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. ఇక నెట్ ఫిక్స్ వెబ్ సిరీస్ 'లిటిల్ థింగ్స్' తో ఫేమస్ అయింది. ప్రస్తుతం ఆమె ఫ్యాషన్ బిజినెస్ లో బిజీగా ఉంది. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మిథిలా ఎప్పటికప్పుడూ తన ఫోటోలను అప్ లోడ్ చేస్తూ నెట్టింట హీట్ పుట్టిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. లేటెస్ట్ ఫొటోస్ తో మరోసారి కురాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.